# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 21-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 282 పేజీలు 8 వెల: రూ.1/-

## తండ్రిని చంపిన కొడుకు అరెస్ట్

హైదరాబాద్, ఆగష్టు 20: తండ్రిని హత్య చేసిన కొడుకు కిషన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 16వ తేదీన మౌలాలి ఆర్టీసీ కాలనీలో తన తండ్రి మారుతి(80)ని కిషన్ హత్య చేశాడు. స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు. హత్య సమయంలో నిందితుడి తల్లి, సోదరి పక్కనే ఉన్నారని పోలీసుల విచారణలో తేలింది. కిషన్‌తో పాటు అతడి తల్లి, సోదిరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. తండ్రిని చంపిన కిషన్ అతడి శరీర భాగాలను బకెట్లలో కుక్కాడు.

# కొత్తరెవెన్యూ చట్టంపై కసరత్తు

### కలెక్టర్లతో భేటీ అయిన సిఎం కెసిఆర్
### ప్రగతి భవన్ వేదికగా సుదీర్ఘ చర్చ

హైదరాబాద్,ఆగస్ట్20 (ఆంఎన్ఎ): రెవెన్యూ చట్టంలో మార్పులు,చేర్పులు, నూతన చట్టాల ఆవశ్యకతపై సిఎం కెసిఆర్ తలపెట్టిన మార్పులకు సంబంధించి కసరత్తు మొదలయ్యింది. సిఎం కెసిఆర్ అధ్యక్షతన అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. కొత్త రెవెన్యూ చట్టంపై వారి అభిప్రాయాలను తీసుకోనున్నారు. పంచాయతీ, పురపాలక చట్టాల అమలు, 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ల కొత్త పాత్రను వివరించడంతో పాటు కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పన, పంచాయతీరాజ్, పురపాలక చట్టాల అమలుతో పాటు సాగునీటి వినియోగ ప్రణాళిక అంశాలపై ఇందులో చర్చించనున్నారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశాల ఎజెండాలో దాదాపు 32కి పైగా అంశాలున్నాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి కెసిఆర్ సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో రెండో సారి తెరాస ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక.. తొలిసారిగా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో సుపరిపాలన లక్ష్యంతో సీఎం కొత్త పంచా యతీరాజ్, పురపాలక చట్టాలను రూపొందించిన విషయం తెలిసిందే. ఇందులో కలెక్టర్లకు కొత్త అధికారాలు కల్పించారు. ఇదే తరహాలో కొత్త రెవెన్యూ చట్టం సిద్ధమవుతోంది. దీన్ని సీఎం అత్యంత కీలకంగా భావిస్తున్నారు. దీనిపై ఇప్పటికే సుదీర్ఘ కసరత్తు జరిగింది. పార్లమెంటు ఎన్నికల సమయంలోనే కొత్త చట్టం గురించి వెల్లడించిన ముఖ్యమంత్రి దానికి అనుగుణంగా రూపకల్పన చేపట్టారు. అధికారులు, నిపుణులతో చర్చలు జరిపారు. చట్టం కూర్పు తుది దశలో ఉండగా.. జిల్లా కలెక్టర్లు దీనిపై ఎలా పనిచేయాలనే దానిపై... వారి నుంచే అభిప్రా యాలను, సూచనలను, సలహాలను స్వీకరించి.. ఇందులో చేర్చాలని నిర్ణయించారు. ఇటీవల పంద్రాగస్ట్ సందేశంలోనూ సిఎం కెసిఆర్ ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల పాటు కలెక్టర్లతో సీఎం కేసీఆర్ సమావేశమవుతున్నారు.



కర్నాటక మంత్రివర్గ విస్తరణ సందర్భంగా కొత్త మంత్రులతో గవర్నర్ వాజూభాయి వాలా. చిత్రంలో సిఎం యెదుయూరప్ప కూడా ఉన్నారు.

# కొలువుదీరిన కర్ణాటక మంత్రివర్గం

### - మంత్రులుగా 17మంది ప్రమాణ స్వీకారం
### - ప్రమాణం చేయించిన గవర్నర్ బాజూభాయ్ వాలా

బెంగళూరు, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : కర్ణాటకలో మంత్రివర్గవిస్తరణ జరిగింది. కర్ణాటక భాజపా అధ్యక్షుడు యడియూరప్ప నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తన క్యాబినెట్‌లో 17 మందికి స్థానం కల్పించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో 17మందిచేత గవర్నర్ బాజూభాయ్ వాలా ప్రమాణస్వీకారం చేయించారు. ప్రమాణస్వీకారం చేసిన వారిలో గోవింద మఖ్జప్ప, డాక్టర్ అశ్వంత్ నారాయణ్ సీఎన్, లక్ష్మణ్ సంగప్ప సవడి, ఆర్.అశోక, బి.శ్రీరాములు, ఎన్.సురేష్ కుమార్, వి.సోమన్న, కోట శ్రీనివాస్ పూజారి, జేసీ మధుస్వామి, చంద్రకాంత్ గౌడ చెన్నప్ప గౌడ పాటిల్, హెచ్.గణెలిష్, ప్రభు చౌహన్, జొల్లే శశికళ, కేఎస్ ఈశ్వరప్ప, జగదీష్ షెట్టర్, సీటీ రవి, బి.బస్వరాజ్ ఉన్నారు. జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత.. జులై 26న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన యడియూరప్ప.. 29న అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకున్నారు. కొత్త మంత్రి వర్గం మాత్రం ఏర్పాటు కాలేదు. మూడు వారాల పాటూ కేబినెట్‌పై కసరత్తు చేసిన సీఎం యడియూరప్ప.. 17మంది జాబితాను అధిష్టానానికి పంపించారు. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త మంత్రివర్గం కొలువు దీరడంతో ఇక పూర్తిస్థాయి పాలనపై ఫోకస్ పెట్టనున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు ఎవరికి ఏ శాఖను కేటాయిస్తారనేది ఆసక్తిగా మారింది. కీలక శాఖలకు యడియూరప్ప ఎవరికి అప్పగిస్తారనేదానిపై చర్చ సాగుతుంది.

# రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళి

### దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల శ్రద్ధాంజలి
### ఢిల్లీలో నివాళి అర్పించిన సోనియా,రాహుల్,ప్రియాంక



రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలో రాజీవ్ సమాధి వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియాగాంధీ. తనయుడు రాహుల్.

న్యూఢిల్లీ,ఆగస్ట్20 (ఆంఎన్ఎ): మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ 75వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించాయి. రాజీవ్ సమాధి వద్ద ఆయన సతీమణి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజీవ్‌కు నివాళులర్పించారు. దిల్లీలోని రాజీవ్‌గాంధీ స్మారక ప్రాంతమైన వీర్ భూమి వద్ద సోనియాతో పాటు ఆయన కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాహుల్ తన తండ్రిని గుర్తు చేసుకున్నారు. అందరినీ గౌరవించడం, ప్రేమించడమే ఆయన తనకు నేర్పించారని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు గులామ్ నబీ అజాద్, భూపేందర్ సింగ్ హుడా, అహ్మద్ పటేల్ తదితరులు రాజీవ్ గాంధీకి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ 75వ జయంతి సందర్భంగా పార్లమెంటు హాలులో నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా పలువురు ప్రముఖులు రాజీవ్ గాంధీ నిలువెత్తు పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాజీవ్ సతీమణి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ, సుబ్రహ్మణ్య స్వామి, గులాం నబీ ఆజాద్, ఇతర ఎంపీలు రాజీవ్‌కు నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను నేతలు కొనియాడారు. దేశ వ్యాప్తంగా కూడా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో రాజీవ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రాజీవ్ జయంతిని ఘనంగా నిర్వహించాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో టీపీసీసీ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు.

# జాబిల్లి కక్షలోకి చంద్రయాన్-2

### - సెప్టెంబర్ 7న తెల్లవారుజామున జాబిల్లిపైకి
### - వివరాలు వెల్లడించిన ఇస్రో చైర్మన్ కె. శివన్

బెంగళూరు, ఆగస్టు20(ఆంఎన్ఎ): హైదరాబాద్, ఆగస్టు20 (ఆర్ఎన్ఎ) : చంద్రయాన్- 2 విజయవంతంగా లూనార్ ఆర్బిట్‌లోకి ప్రవేశించినట్లు ఇస్రో చైర్మన్ కె. శివన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. సెప్టెంబర్ 2వ తేదీన చంద్రయాన్2కు సంబంధించి మరో కీలక ఘట్టం ఉంటుందన్నారు. ఇక నుంచి జరగబోయే అన్ని ప్రక్రియల్ని సాంకేతిక అంశాలతో సహా వివరించారు. మంగళవారం చంద్రయాన్-2లో కీలక ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేశామన్నారు. చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టాల్సిన విన్యాసం ఉదయం 9గంటలకు ప్రారంభమై 30మిషాలు పాటు సాగిందని తెలిపారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపైకి చేరాలంటే ఓ కచ్చితమైన కక్ష్యలోకి వ్యోమనౌకను చేర్చాల్సి ఉంటుందని తెలిపారు. దానికి ఉపగ్రహాన్ని 90డిగ్రీలు మళ్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం 88 డిగ్రీల ఇంక్లినేషన్‌తో చంద్రయాన్-2 చంద్రుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో మరోసారి కక్ష్యను మార్చాల్సి ఉంటుందని, అప్పుడు 90 డిగ్రీల ఇంక్లినేషన్‌కి చేరుకుంటుందని శివన్ తెలిపారు. జులై 22న ప్రయోగించిన తర్వాత ఇప్పటి వరకు మొత్తం 5 విన్యాసాలు చేపట్టామని, అందులో ఆగస్టు 14న చేపట్టిన ట్రాన్స్ ల్యూనార్ ప్రక్రియ అత్యంత కీలకమైనదన్నారు. ఇప్పటి వరకు చంద్రయాన్-2లోని వ్యవస్థలన్నింటి పనితీరు సజావుగా సాగుతోందని శివన్ వివరించారు. ప్రస్తుతం చంద్రుడి కక్ష్యలో చక్కర్లు కొడుతున్న చంద్రయాన్-2 జాబిల్లి ఉపరితలానికి చేరుకునే క్రమంలో చేసే ప్రయోగాలను శివన్ సాంకేతిక అంశాల ఆధారంగా వివరించే ప్రయత్నం చేశారరని, మరో నాలుగు విన్యాసాల ద్వారా చంద్రయాన్-2 కక్ష్యలను తగ్గిస్తూ వస్తామన్నారు. సెప్టెంబరు 2న ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోతుందని, ల్యాండర్‌లో వ్యవస్థలన్నింటిని సిద్ధం చేసేలా సెప్టెంబరు 3న మూడు సెకన్ల పాటు మరో విన్యాసం చేయాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబరు 4న మరో 6సెకన్ల పాటు ల్యాండర్‌పై మరో విన్యాసం ఉంటుందని, అక్కడి నుంచి మూడురోజుల పాటు వ్యవస్థలన్నింటినీ నిశితంగా పరిశీలిస్తామని, ఇక సెప్టెంబరు 7న వేకువజామున 1.40గంటలకు ల్యాండర్‌లో ప్రొపల్షన్ ప్రారంభమై 1.55గంటలకు ల్యాండ్ అవుతుందని అన్నారు. అనంతరం రెండు గంటల తర్వాత ల్యాండర్‌లోని ర్యాంప్ చంద్రుడి ఉపరితలాన్ని తాకుతుందన్నారు. 3.10గంటలకు సోలార్ ప్యానెళ్లు తెరచుకుంటాయని, సరిగ్గా 4గంటల ప్రాంతంలో రోవర్ జాబిల్లి ఉపరితలానికి చేరకుని మిషన్‌ని ప్రారంభిసుందన్నారు. చంద్రుడి ఆవిర్భావం సహా అక్కడి వాతావరణంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేపడుతుందని శివన్ ప్రయోగ వివరాలను వివరించారు.

# వినాయక వేడుకల్లో బాణాసంచాకు అనుమతి లేదు

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): నగరంలో వినాయక చవితి వేడుకలను సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించనున్నారు.

ఈ సమయంలో బహిరంగ ప్రదేశాలు, రహదారులపై బాణాసంచా కాల్చొద్దని, దీనిపై నిషేధం విధించినట్లు నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ తెలిపారు. ఈ నిషేధం 2వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 12 రాత్రి వరకు అమల్లో ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతియుత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని నగర ప్రజలకు సీపీ అంజనీ కుమార్ పిలుపునిచ్చారు.

## చిన్నపాటి వివాదానికే హత్య

హైదరాబాద్, ఆగస్ట్20: ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ సమీపంలో జరిగిన హత్యకేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు ఖైరతాబాద్‌కు చెందిన ప్రకాశ్‌గా పోలీసులు గుర్తించారు. ఇరువురి మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదమే హత్యకు దారితీసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసిన సైఫాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీసీ టీవీ ఫుటేజీల ద్వారా నిందితుడిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడు బంగారయ్య నాగర్‌కర్నూల్ జిల్లా నింగాల మండలం జీనుగపల్లి తండా వాసిగా గుర్తించారు. భార్యతో గొడవ జరగడంతో బయటకు వచ్చిన బంగారయ్యకు ప్రకాశ్‌కు దారిలో చిన్న వివాదం జరిగింది. దీంతో కొపగించుకున్న ప్రకాశ్ బండరాయితో బంగారయ్య తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం గుర్తించిన పోలీసులు శవానికి పంచనామా చేసి పోస్టుమార్టంకు తరలించారు. మొదట కుటుంబ కలహాలే హత్యకు కారణమనుకున్న పోలీసులు తరువాత సీసీ కెమెరాలను పరిశీలించడంతో నిందితుడు దొరికిపోయాడు

## చరిత్రలో నేటినిజం



కం॥ అటవీ ప్రాణులు - పలు సం
కటములలో చిక్కినంత తరుణా స్పదమై
స్ఫుటముగ - భారత మాతయె
పటుతరమగు చట్టమునిడి పరిరక్షించెనే!!

( ఆగష్టు 21 వన్యప్రాణి సంరక్షణ చట్టం వచ్చిన రోజు..) -రాధశ్రీ

సెల్: 9494481210

### కోర్టు ధిక్కరణ కేసులో..

# ఇద్దరు అధికారులకు జైలుశిక్ష

### - సంచలన తీర్పును వెలువరించిన హైకోర్టు
### - మల్లన్నసాగర్ భూనిర్వాసితుల కేసులో నిర్లక్ష్యం వహించిన అధికారులు
### - రెండు నెలలు జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధింపు
### - కోర్టు తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేసిన బాధితులు

హైదరాబాద్, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : మల్లన్న సాగర్ భూనిర్వాసితుల కేసులో మంగళవారం హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కోర్టు సూచనలు ధిక్కరిస్తూ నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులకు జైలు శిక్ష విధించింది.

గజ్వేల్ ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, కొండపాక తహసీల్దార్ ప్రభుకు ఉన్నత న్యాయస్థానం రెండు నెలల జైలుశిక్ష విధించింది. జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధించింది. అలాగే ఇద్దరు అధికారులపై 6నెలల పాటు సస్పెన్షన్ విధించింది. వివరాల్లోకి వెళితే.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మల్లన్నసాగర్ జలాశయ నిర్మాణంకోసం ప్రభుత్వం గతంలో భూసేకరణ చేపట్టింది. సాగర్ పరిధిలోకి వచ్చిన ప్రజ్ఞాపూర్ మండలంలోని తుప్పారం ప్రాంతానికి చెందిన భూములను కూడా సేకరించింది. అయితే ఆ ప్రక్రియను సవాల్ చేస్తూ ముగ్గురు వ్యక్తులు హై కోర్టును ఆశ్రయించారు. తగిన పరిహారం ఇవ్వకుండా భూములను స్వాధీనం చేసుకుంటున్నారని, చట్టవిరుద్ధంగా చేపట్టిన ఈ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని గతంలో వారు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం బాధితులకు సరైన పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేపట్టాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి విచారణ ముగిసే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని పేర్కొంది. కానీ, కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా రాత్రికి రాత్రే తమ వద్ద నుంచి భూములు లాక్కున్నారని, మళ్లీ ఆ ముగ్గురూ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను వేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం సదరు అధికారులకు జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చింది.

# సాగర్‌లో 12 గేట్లు,శ్రీశైలంలో ఐదు గేట్లు మూసివేత

## ఎగువ నుంచి వరద తగ్గడంతో అధికారుల చర్యలు

నల్గొండ,ఆగస్టు20 (ఆంఎన్ఎ): కృష్ణా పరివాహకంలో వరద క్రమంగా తగ్గుముఖం పట్టడంతో సాగర్‌తో పాటు, శ్రీశైలం గేట్లను మెల్లగా మూసేస్తున్నారు. పులిచింతలకు కూడా నీటి రాక తగ్గింది. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణా నదిలోని ప్రాజెక్టుల్లోకి వరద క్రమంగా నెమ్మదించింది. దీంతో అధికారులు నాగార్జునసాగర్ ప్రాజెక్టులోని మొత్తం 12 గేట్లనూ మూసివేశారు. ప్రస్తుతం 14 గేట్ల ద్వారా 2.16 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి 4.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 2.55 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. సాగర్ పూర్తి స్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 303.94 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.70 అడుగులుగా ఉంది. మరోవైపు శ్రీశైలం జలాశయంలోకి క్రమంగా వరద తగ్గుముఖం పట్టడంలో ఐదు గేట్లను అధికారులు మూసివేశారు. ప్రస్తుతం 3.87 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వస్తుండగా 2.47 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883 అడుగులుగా ఉంది. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 205 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. శ్రీశైలం కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30,459 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 42 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 2,026 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 34 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల జలాశయంలోనూ వరద ఉధృతి క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుతం జలాశయంలో ఇన్‌ఫ్లో 2.99 లక్షల క్యూసెక్కులు కాగా ఔట్‌ఫ్లో 2.09 లక్షల క్యూసెక్కులుగా ఉంది. పులిచింతల పూర్తి?స్థాయి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 36.66 టీఎంసీలుగా ఉంది. జలాశయం ప్రస్తుతం నీటిమట్టం 168.56 అడుగులుగా ఉంది.

# గవర్నర్ నరసింహన్‌కు స్వల్ప అస్వస్థత

హైదరాబాద్,ఆగస్టు120 (ఆర్ఎన్ఎ): తెలంగాణ గవర్నర్ నరసింహన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సతీమణి విమలతో కలిసి బిహార్‌లోని గయ పర్యటనకు వెళ్లిన ఆయన సోమవారం అకస్మాత్తుగా వాంతులతో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను సమీపంలోని వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ముందు జాగ్రత్తగా రక్తపరీక్ష, ఈసీజీ నిర్వహించారు. ఎలాంటి సమస్యా లేదని నిర్ధారించుకున్న తర్వాత గవర్నర్ అక్కడి నుంచి దిల్లీ వెళ్లారు. దిల్లీ పర్యటన తర్వాత ఆయన హైదరాబాద్ చేరుకోనున్నారు.

# వికారాబాద్‌ను కరవు నుంచి కాపాడండి

## ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నేతలు

వికారాబాద్,ఆగస్టు20 (ఆర్ఎన్ఎ): వికారాబాద్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అభివృద్ధి పై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరో?పించారు. సంక్షేమ పథకాల అమల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు రామ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ తదితర నేతలు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ, గత ప్రభుత్వం జిల్లా సాగునీటి అవసరాల కోసం చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును అకారణంగా రద్దు చేసారని, 6 ఏళ్ల నుంచి పరిగి-కొందుర్గు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి కృష్ణా నీటిని జిల్లాకు తీసుకువస్తామని చెబుతున్న ప్రభుత్వం ఇంత వరకు టెండర్లు పిలవలేదన్నారు. సరిపడా వర్షాలు లేక జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, రైతులకు లక్ష రూపాయల రుణ మాఫీ హామీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణ, గోదావరి జల్లాలను అనుసంధానించి జిల్లాకు సాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

### బీజేపీది హడావుడే..

# ఆ పార్టీకి విషయం లేదు

**- అది తెలంగాణలో టీఆర్ఎస్ తోక పార్టీనే**

**- 26న నార్కెట్‌పల్లి నుంచి పాదయాత్ర ప్రారంభిస్తా**

**- కాంగ్రెస్ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 20(ఆర్ఎన్ఎ) : తెలంగాణలో బీజేపీది హడావుడేనని.. ఆ పార్టీకి విషయం లేదని, తెలంగాణ ప్రజలు బీజేపీని విశ్వసించరని కాంగ్రెస్ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. తెలంగాణలో టీఆర్ఎస్‌కు బీజేపీ తోకపార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. ఇక, రాష్ట్రంలో బీజేపీ హడావిడి చేస్తోంది.. కానీ, విషయం లేదని వ్యాఖ్యానించారు. మరోవైపు కొన్నిపొరపాట్ల వల్లనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందన్న ఆయన.. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే అనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ఎండగడుతూ ప్రజాల్లోకి వెళ్లేందుకు ఈ నెల 26వ తేదీన నార్కెట్‌పల్లి నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నట్టు వెంకట్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో ఓటు బ్యాంకే లేని బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతుంటే నవ్వొస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ హవా సాగుతున్నా.. తెలంగాణలో మాత్రం బీజేపీకి అవకాశం ఉండదని అన్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం పొందనుందని, టీఆర్ఎస్ పార్టీ పాలన పట్ల ప్రజలు విసిగిపోతున్నారని, కాంగ్రెస్సేతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారని అన్నారు. ఇప్పుడు టీఆర్ఎస్, బీజేపీలోకి వెళ్లినవారంతా ఎన్నికల సమయం నాటికి కాంగ్రెస్‌లోకి వస్తారని, ఆ విధంగా ప్రజలే కాంగ్రెస్‌కు దన్నుగా ఉంటారని కోమటిరెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ పెట్టిన బిల్లులకు మద్దతు ఇస్తున్న టీఆర్ఎస్ పార్టీ, రాష్ట్రంలో మాత్రం బీజేపీపై వ్యతిరేకంగా మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందని, ఈ రెండు పార్టీలు ఒకే గూటి పక్షులని ప్రజలు అర్థంచేసుకున్నారని, ఆ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# పాదయారులపైకి దూసుకెళ్లిన కారు

## పలువురికి గాయాలు

బెంగళూరు,ఆగస్టు20 (ఆర్ఎన్ఎ): బెంగుళూరులో ఓ కారు డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి బీభత్సం సృష్టించాడు. వేగంగా కారు నడుపుతూ నియంత్రణ కోల్పోయి పాదచారులపైకి దూసుకొచ్చాడు. ఈ ఘటనలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాద దృశ్యాలు అక్కడున్న సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి.

# మరో 25ఏళ్లు మోడీయే ప్రధాని

## గోవా సీఎం ప్రమోద్ సావంత్ ధీమా

పనాజి,ఆగస్టు20(ఆర్ఎన్ఎ): మరో 25 ఏళ్ల పాటు నరేంద్ర మోదీయే దేశాన్ని పాలిస్తారని గోవా సీఎం ప్రమోద్ సావంత్ ధీమా వ్యక్తం చేశారు. కశ్మీర్లో 370 రద్దు సాహసోపేత నిర్ణయమని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంచలన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన కార్యకర్తల సమావేశంలో మాటాడారు. ఈ సమావేశానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు, సభ్యత్వ నమోదు కార్యక్రమ బాధ్యుడు శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా పాల్గొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేషమైన స్పందన వస్తోందని, మరో 25 ఏళ్ళ పాటు మోదీ ప్రభుత్వమే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. శివరాజ్‌ను ఉద్దేశించి మాట్లాడిన సావంత్... చౌహాన్ హయాంలో మధ్యప్రదేశ్‌లో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, రాబోయే ఎన్నికల్లో ఆయన నేతృత్వంలో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'లాడ్లీ లక్ష్మి' అనే పథకంతో ఆయన్ను రాష్ట్రమంతా మామ అని పిలిచేంతగా అక్కడి ప్రజలకు చేరువయ్యారని గుర్తుచేశారు. మధ్యప్రదేశ్ ప్రజలు చౌహాన్‌ను మిస్సవుతున్నారని ప్రమోద్ సావంత్ అన్నారు.

# రిజర్వేషన్లపై చర్చ అవసరం లేదు

## - కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే

న్యూఢిల్లీ, ఆగస్టు20(ఆంఎన్ఎ) : రిజర్వేషన్లపై చర్చ అవసరం లేదని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే అన్నారు. రిజర్వేషన్లపై సామరస్యపూర్వక వాతావరణంలో చర్చలు జరగాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆయా వర్గాలకు కల్పిస్తున్న రిజర్వేషన్లపై చర్చ అవసరం లేదని పేర్కొన్నారు. ఏ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగిందో ఆ రిజర్వేషన్ల జోలికి పోరాదని అన్నారు. ఇప్పుడు ఇతర వర్గాలు కూడా రిజర్వేషన్లు పొందుతున్నారని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లు ఎవరికి చేరుతున్నాయనే దానిపై చర్చ జరుగుతూ ఉండొచ్చని, అయితే రిజర్వేషన్లు ఉండాలా? వద్దా? అనే దానిపై చర్చ అవసరం లేదని ఆర్పీఐ చీఫ్, కేంద్ర సామాజిక న్యాయం, సాధికరత శాఖ మంత్రి అథవాలే అన్నారు. దీనికి ముందు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆదివారంనాడు ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ శిక్షా సంస్కృతి ఉత్థాన్ నిర్వహించిన జ్ఞాన్ ఉత్సవ్ కార్యాక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రిజర్వేషన్లపై చర్చలు జరిగిన ప్రతిసారి ఘాటు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయని, అలాకాకుండా అన్ని వర్గాలవారూ సుహృద్భావ రీతిలో అభిప్రాయాలు పంచుకోవాలని అన్నారు. రిజర్వేషన్ల అనుకూలురు, వ్యతిరేకులు ఎదుటి పక్షం ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని వాదనలు వినిపించాలని అన్నారు

# ఎన్నికల హామీలను అమలుచేయాలి

## కాంగ్రెస్ నేతల డిమాండ్

పరిగి,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): ఎన్నికల సమయంలో తెరాస ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. రూ. లక్ష రుణమాఫీ, రెండు పడకగదుల ఇళ్లు, చార్మినార్ జోన్‌లో కలపటం వంటి హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెరాస ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూపంపిణీ అమలు చేయాలని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా రైతుల పొట్టకొట్టి రాయలసీమ ప్రాంతానికి ముఖ్యమంత్రి సాగునీరు ఇస్తామనడం సరికాదని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పాదయాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దారు అనురాధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణరెడ్డి, వెంకటేష్, భీంరెడ్డి, సుభాష్‌రెడ్డి, ఆశోక్, కృష్ణ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# చిదంబరానికి ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ, ఆగస్టు20 (ఆర్ఎన్ఎ) : కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ సోమవారం నోటీసులు జారీ చేసింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎయిరిండియాకు సంబంధించిన విమానాల ఒప్పందంలో అవకతవకలు జరిగాయని.. అప్పట్లో మంత్రిగా ఉన్న చిదంబరంపై ఆరోపణలు వచ్చాయి. దీంతో, ఆ కేసును విచారిస్తున్న దర్యాప్తు సంస్థ సోమవారం నోటీసులు జారీ చేసింది. బోయింగ్, ఎయిర్‌బస్ నుండి 111 విమానాలను 70,000 కోట్ల రూపాయలకు కొనుగోలు చేశారు. దీంట్లో లాభదాయకమైన మార్గాలు, ప్రైవేటు విమానయాన సంస్థలకు షెడ్యూల్ ఇవ్వడం, విదేశీ పెట్టుబడులతో శిక్షణా సంస్థలను ప్రారంభించడం వంటి పలు ఆరోపణలున్నాయి. ఈ కేసులో పౌరవిమానయాన శాఖ మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్‌ను కూడా గత వారమే సీబీఐ విచారణకు పిలిచింది. విదేశీ విమానయాన సంస్థలకు అనుకూలంగా ఉండటానికి, ఎయిరిండియాను దూరంగా ఉంచడానికి తల్వార్ పటేల్‌తో చర్చలు జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా, 2004 - 2011 మధ్య పౌర విమానయాన మంత్రిగా పటేల్.. తల్వార్‌పై చార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. దాంట్లో పటేల్ పేరును కూడా పేర్కొంది.

# రైతు మార్గదర్శి పుస్తకావిష్కరణ

## రచయితను అభినందించిన మంత్రి నిరంజన్

హైదరాబాద్,ఆగస్ట్20 (ఆంఎన్ఎ): బేగంపేటలోని హోటల్ హరిత ప్లాజాలో 'రైతు మార్గదర్శి' పుస్తకాన్ని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ ఛైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, ఆగ్రోస్ ఎండీ సురేందర్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'రైతులకు సంబంధించి ఆలోచనలను పుస్తకరూపంలో తీసుకొచ్చిన లింగంపల్లి కిషన్‌రావుకు అభినందించారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాను. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని మన ఎంపీలు కోరారు. సీఎం కేసీఆర్ ఆలోచనతోనే రైతుబంధు, రైతుబీమా పథకాలు వచ్చాయి. రాష్ట్రపథకాలు అద్భుతమని నీతి ఆయోగ్ కితాబు ఇచ్చింది. రాష్ట్రానికి రూ.24వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ కేంద్రానికి సూచించింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లక్షల ఎకరాలకు సాగు నీరందే ప్రాజెక్టు ఎక్కడైనా నిర్మించిందా? కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి చేసిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కింది. ఇష్టారాజ్యంగా బీజేపీ నేతలు విమర్శలు చేయడం సరికాదని' నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

# యురేనియం తవ్వకాలపై ఉద్యమించాలి

## జగన్‌ను కూడా కలుపుకుని పోవాలి: వీహెచ్

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): నల్లమల అడవుల్లో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా పార్టీ పరంగా కాంగ్రెస్ ఉద్యమించాల్సిన అవసరముందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అభిప్రాయ పడ్డారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ అంశంపై సీనియర్ నేతలతో సమావేశం నిర్వహించి, ప్రజలను సమీకరించి కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు. సోమవారం వీహెచ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సమస్యలపై కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశాలకే పరిమితమవుతున్నారని ఆయన విమర్శించారు. యురేనియం అంశంపై ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు యురేనియం తవ్వకాలతో నష్టం జరుగుతుందని.. అవసరమైతే ఈ అంశంపై ఏపీ సీఎం జగన్‌ను కూడా కలవాలని కాంగ్రెస్ నేతలకు వీహెచ్ సూచించారు. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా.. చెంచుల జీవితాల్లో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ చలాన్ల పేరుతో పోలీసులు ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

# 23న పెన్షన్ అదాలత్

## -సమస్యలను పరిష్కరించుకోవాలి: కలెక్టర్

వరంగల్,ఆగస్ట్20(నేటినిజం ప్రతినిధి): ఈ నెల 23న శుక్రవారం ఉదయం 11.00 గంటలనుండి హన్మకొండ అంబేడ్కర్ భవనలో, పెన్షన్ దారుల అదాలత్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె. పాటిల్ ఒకప్రకటనలో తెలిపారు. పెన్షన్ అధాలత్‌కు తాను అధ్యక్షత వహించనున్నట్లు తేలిపారు. దీనిలో ఫించను దారులు ఎదుర్కొంటున్న సమస్య లను అధికారుల దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసు కొనున్నట్లు తెలిపారు. ఫించను దారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఒక వేదిక ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వము దేశంలోని అన్నీ జిల్లా కేంద్రాలలో ఫించను అదాలత్ లను నిర్వహిం చవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం జరిగింది. దీనిలో భాగం గా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఖజానా శాఖ సంచాలకుల వారిని కన్వీనర్ గా నియమిం చడం జరిగింది. ఫించను అదాలత్‌ను ఎలా నిర్వహించాలో, దాని విధి విధానాలను ఖజానా శాఖ సంచాలకులు శ్రీ రామచంద్ర మూర్తి, వీడియో కాన్ఫరెన్సు ద్వారా అన్నీ జిల్లా ఖజానా శాఖ సిబ్బందికి తెలియచేసారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వంలో ఫించనుదారులు ఎదుర్కొంటున్న సమస్యలలో కొన్నింటిని హైదరాబాద్‌లోని అకౌంటెంట్ జనరల్, వారి కార్యాలయము గుర్తించి అన్ని జిల్లా ఖజానా కార్యాలయాలకు అందచేయడం జరిగింది. వరంగల్ అర్బన్ జిల్లాలో ప్రొవిజనల్ పెన్షన్ కేసులను పరిష్కరించవలసినదిగా సూచించారు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణకు ఆరు నెలలు ముందుగా తమ ఫించను పత్రాలను తను పని చేస్తున్న డ్రాయింగ్ అధికారి ద్వారా అకౌంటెంట్ జనరల్ అధికారి, హైదరాబాద్ లేదా జిల్లా ఆడిట్ అధికారి, వరంగల్ అర్బన్ జిల్లా వారికి సరి అయిన పత్రాలతో పంపుకోవాలి. వాటిని, వారు పరిశీలించి ఫించను, గ్రాట్యుటీ కమ్యూటేషన్ లను ఆథరైజ్ చేస్తారు. శాఖాపరమైన లేదా క్రిమినల్ కేసులు పెండిగ్ లో ఉన్న సందర్భంలో ప్రొవిజనల్ పెన్షన్ మంజూరు చేస్తారు. కొన్ని సందర్భాలలో, ఏటువంటి శాఖా పరమైన లేదా క్రిమినల్ కేసులు పెండిగ్ లో లేకున్ననూ రిటైర్మెంట్ అయిన వెంటనే ఫించను మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవడం లేదు. వీటిని జిల్లా కలెక్టరు గారి దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికై ఆదేశాలు జారీ చేస్తారు. పెన్షన్ అదాలత్‌కు జిల్లా ఖజానా అధికారి కన్వీనర్ గా వ్యవహరిస్తారు. జిల్లా ఆడిట్ అధికారి, పే అండ్ అక్కౌంట్స్ అధికారి, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్, రాష్ట్ర ఆర్థిక శాఖ, రాష్ట్ర ఖజానా శాఖనుంచి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు అవుతారు.

# జైట్లీని పరామర్శించిన అద్వానీ

న్యూఢిల్లీ, ఆగస్టు20(ఆంఎన్ఎ) : తీవ్ర అనారోగ్యంతో ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ (66)ని పార్టీ దిగ్గజ నేత ఎల్‌కే అద్వానీ సోమవారం పరామర్శించారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఈ నెల 9న ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిన విషయం తెలిసిందే. జైట్లీ ఇంకా కోలుకోకపోవడంతో పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ సీనియర్ నాయకులు ఆయనను పరామర్శిస్తున్నారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, జితేంద్ర సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ఎయిమ్స్‌లో జైట్లీని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు ఈనెల 10 నుంచి జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై ఎయిమ్స్ ఎలాంటి హెల్త్ బులెటిన్ విడుదల చేయక పోవడంతో పలువురు ప్రముఖ నేతలు ఆయన ఆరోగ్య పరిస్థితిని వాకబు చేసేందుకు ఎయిమ్స్‌కు తరలివస్తున్నారు. కాగా, నరేంద్ర మోదీ తొలి సర్కార్‌లో ఆర్థిక మంత్రిగా ఉన్నపుడే అరుణ్ జైట్లీ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో అమెరికాలో ఆయనకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరిగింది. ఈ నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన అనంతరం, అనారోగ్యం కారణంగా తనను కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకోవద్దని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసిన సంగతి విదితమే.

# ఒక్క ఫొటో ప్రభుత్వాన్ని ఆలోచింపజేస్తుంది

## - సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

సిద్దిపేట, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : ఫొటోగ్రఫీ గొప్ప వృత్తి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని దూది మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన 180వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాగురే అనే వ్యక్తి కెమెరాను కనుగొన్నారని పేర్కొన్నారు. 100 పేజీలు రాయలేని పుస్తకాన్ని ఒక ఫొటో చెప్పగల్గుతుందన్నారు. కార్యక్రమం ఏదైనా ఫొటో జీవితాన్నే మారుస్తుందన్నారు. ఒక ఫొటో ప్రభుత్వాలను ఆలోచింపజేస్తుందని పేర్కొన్నారు. సిద్దిపేటలో ఫొటోగ్రఫీ భవనం కోసం రూ.25 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఫొటోగ్రాఫర్లకు ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డ్స్ గురించి సీఎంతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని అన్నారు. పట్టణంలోని పేద ఫొటోగ్రాఫర్ల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. సిద్దిపేట ఫొటోగ్రాఫర్ల కోసం గ్రూప్ ఇన్సూరెన్స్ చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన సిద్దిపేట ఫొటోగ్రాఫర్లకు హరీష్ రావు అభినందనలు తెలిపారు.



వరంగల్ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే సందర్భంగా సమస్యలు తెలిపేందుకు వచ్చిన ప్రజలు

ఏపీ వార్తలు

# డ్రోన్ ఘటన అనుమానాలకు తావిస్తోంది!

**పట్టుబడిన వ్యక్తి జగన్ నివాసంలో ఉండే కిరణ్ ఆదేశాల మేరకు చిత్రీకరించారు**

**- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి**

**- గవర్నర్ బిశ్వభూషణ్‌కు తెదేపా నేతల ఫిర్యాదు**

**- వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలమైంది**

**- వరదలసాకుతో బాబును ఇబ్బందులు పెట్టాలని చూశారు**

**- టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, బుచ్చయ్యచౌదరి**

అమరావతి, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : తెదేపా అధినేత చంద్రబాబు నివాసంపై డ్రోన్‌లు ఎగురవేయడం పలు అనుమానాలకు తావునిస్తోందని, డ్రోన్‌లు ఎగురవేస్తూ పట్టుబడిన వ్యక్తి జగన్ నివాసంలో ఉండే కిరణ్ ఆదేశాల మేరకు చిత్రీకరించారని ఆ పార్టీ నేతలు గవర్నర్ బిశ్వభూషణ్‌ను రాజ్‌భవన్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. సోమవారం విజయవాడ ఎంపీ కేశినేని నాని, గల్లా జయదేవ్, టీడీఎల్పీ ఉపనేతలు అచ్చెన్నాయుడు, బుచ్చయ్యచౌదరి, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామారావు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడుతో సహా 15మంది సభ్యుల బృందం గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నాలుగు పేజీల లేఖను గవర్నర్‌కు అందజేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో చంద్రబాబు భద్రతను కుదించిన ప్రభుత్వం.. హైకోర్టు ఆదేశాల తర్వాత తిరిగి భద్రతను పెంచడాన్ని తెదేపా నేతలు ఈ సందర్భంగా గవర్నర్‌కు గుర్తు చేశారు. వైకాపా ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు పూనుకొంటోందని, డ్రోన్ ఎగరవేస్తూ పట్టుబడిన వ్యక్తి జగన్ నివాసంలో ఉండే కిరణ్ ఆదేశాలమేరకే చిత్రీకరించానని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందని తెదేపా నేతలు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. వరద సహాయకచర్యల్లో ప్రభుత్వ వైఫల్యంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని అన్నారు. కృష్ణానదికి వరదలు వస్తాయని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు పడలేదని, ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల మనకు వరదలు వచ్చాయని మండిపడ్డారు. వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ నిర్లక్ష్యంపై ధ్వజమెత్తారు. కనీస అవగాహన లేకుండా జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతున్నారని, ప్రకాశం బ్యారేజీలో 40టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చని మాట్లాడుతుంటే ఆ మంత్రిని ఏమనాలని ప్రశ్నించారు. ఎత్తిపోతల పథకాలను సరిగా వినియోగించుకుంటే నీటిని నిల్వ చేసుకోవచ్చని అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఇంటిని అద్దెకు తీసుకున్న చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూశారని ఆరోపించారు. గత ఐదేళ్లలో ఎక్కడ వరదలు తుపాన్లు వచ్చినా చంద్రబాబు పనిచేసిన విధానాన్ని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. కానీ ఇప్పుడు మాత్రం వరదలు వచ్చినప్పుడు సీఎం జగన్ విహారయాత్రలకు వెళ్లారని ఎద్దేవా చేశారు. అనంతరం తెదేపా సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరద పరిస్థితి, రైతుల సమస్యలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని, ప్రకాశం బ్యారేజీ సామర్థ్యం 3 టీఎంసీలు అయితే 4 టీఎంసీల వరకు ఎందుకు ఆపారని ప్రశ్నించారు. ఒక్కసారిగా వరద ప్రవాహాన్ని దిగువకు వదిలితే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలియదా? అని ప్రశ్నించారు. దాదాపు 220 టీఎంసీల నీరు వృథాగా పోయిందని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచనే ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. అంతకుముందు కృష్ణానది వరద ఉధృతికి ముంపు బారిన పడిన ప్రాంతాలను తెదేపా నేతల బృందం పరిశీలించింది. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారితో వారు మాట్లాడారు. కృష్ణానదికి దిగువన ఉన్న ప్రాంత ప్రజలను సకాలంలో అప్రమత్తం చేయకపోవడం వల్లే భారీగా ఆస్తినష్టం సంభవించిందని బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. 15రోజుల ముందు నుంచే మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు కృష్ణానది వరద గురించి హెచ్చరికలు చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కనీస చర్యలు చేపట్టలేదని వాపోయారు. బాధిత కుటుంబాలకు తాము అండగా నిలుస్తామని తెదేపా నేతలు హామీ ఇచ్చారు.

## ఫోటో గ్రాఫర్లకు విప్ శుభాకాంక్షలు

విశాఖపట్టణం, ఆగస్ట్ 20 (ఆర్ఎన్ఎ): చోడవరం దుర్గా కల్యాణమండపంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు హాజరై కేకు కట్ చేశారు. ఫొటోగ్రాఫర్ పితామహుడు లూయిస్ దగ్గేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. 180 ఏళ్ల చరిత్ర కలిగిన కెమెరా వల్ల అనేక ప్రయోజనాలు మనం పొందుతున్నామని తెలిపారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. సంఘ సంక్షేమ భవననిర్మాణ స్థల సేకరణకు చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీతో కలిసి తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ కెమెరాల పనితీరుపై సంఘం సభ్యులకు సెట్టింగ్స్‌ఫ్యాకల్టీ శివాజీ అవగాహన కల్పించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చోడవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, ఏపీపీవీడబ్ల్యూఏ ఛైర్మన్ ప్రసాద్, కెమెరామెన్, చోడవరం ఎమ్మెల్యే సోదరుడు జయదేవ్, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొంగరాల సురేశ్, స్వామి, ప్రసాద్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించడానికే

# డ్రోన్ ఉపయోగించాం

**- బాబును ప్రజలు 23 అడుగుల గొయ్యిలో పాతేశారు**

**- టీడీపీ నేతలు బురద రాజకీయాలు మానుకోవాలి**

**- బాబూ.. లోకేష్‌కు రాజకీయ జ్ఞానం నేర్పు**

**- వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేష్**

అమరావతి, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : వరద, ముంపు ప్రాంతాలను పరిశీలించడానికే డ్రోన్‌ను వినియోగించామని, కానీ టీడీపీ నేతలు మాత్రం దాన్ని రాజకీయం చేసి ప్రజల్లో సానుభూతి పొందాలని చూస్తున్నారని వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేష్ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరద వచ్చి ప్రశాంతంగా ముగిసింది కానీ టీడీపీ నాయకుల బురద రాజకీయాలు మాత్రం ఆగలేదని విమర్శించారు. వరద సహాయక చర్యలపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తుంటే.. చంద్రబాబు భజనపరులు మాత్రం బురద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కట్టడంలో ఉండటం తప్పని తెలిసి కూడా చంద్రబాబు అందులోనే ఉండటాన్ని ఏమంటారని ఆయన ప్రశ్నించారు. వరద, ముంపు ప్రాంతాలను పరిశీలించడానికి డ్రోన్ ఉపయోగిస్తే తప్పేంటని ప్రశ్నించారు. చంద్రబాబును హత్య చేయడానికే డ్రోన్‌లు వాడుతున్నారని దేవినేని ఉమా తప్పుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. బాబును ప్రజలు ఎప్పుడో హత్య చేసి.. 23 అడుగుల గొయ్యిలో పాతేశారని జోగి రమేష్ పేర్కొన్నారు. చంద్రబాబుకు ఏమన్నా అయితే ఆత్మహత్య చేసుకుంటానని అంటున్న బుద్ధిలేని బుద్దా వెంకన్నాను ముందు అరెస్ట్ చేయాలని ఆయన కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో అమెరికా వెళ్లారని.. చంద్రబాబులా విందు, వినోదాలకు కాదని స్పష్టం చేశారు. జగన్ విదేశీ పెట్టుబడుల కోసం తాపత్రయ పడుతున్నారని తెలిపారు. చంద్రబాబు మంచి కార్యకర్తలను తయారు చేసుకోకుండా కోవర్టులను తయారు చేసుకున్నారని జోగి రమేష్ ఆరోపించారు. ఆ కోవర్టుల్లో కొందరు బీజేపీలో చేరి చంద్రబాబు గొంతు వినిపిస్తున్నారని ఆయన మండి పడ్డారు. ప్రకాశం బ్యారేజ్ దగ్గర బోట్లు అడ్డంగా పెట్టాలని లోకజ్ఞానం లేని లోకేష్ ట్విట్లు చేస్తున్నాడని రమేష్ ఎగతాళి చేశారు. చంద్రబాబు కనీసం వారానికొకసారైనా లోకేష్‌కు రాజకీయ జ్ఞానం నేర్పాలని రమేష్ కోరార

# మాజీ మంత్రి సుబ్బారాయుడి కుమారుడు మృతి

**- అనారోగ్యంతో చికిత్స పొందుతూ కన్నుమూత**

అమరావతి, ఆగస్టు19(ఆంఎన్ఎ) : మాజీ మంత్రి, వైసీపీ నేత కొత్తపల్లి సుబ్బారాయుడి చిన్న కుమారుడు నారాయణ రాయుడు (35) సోమవారం మృతిచెందారు. చంటిబాబూ అని ముద్దుగా పిలుచుకునే నారాయణ రాయుడు పుట్టుకతోనే మానసిక లోపంతో బాధపడుతున్నాడు. అతడికి చికిత్స అందజేస్తూ వీల్‌చైర్ సాయంతోనే సాకుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం వీల్‌చైర్‌లో ఉన్న చంటిబాబు ఒక్కసారి కుప్పకూలిపోయాడు. దీంతో అతడిని, హుటాహుటిన ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే నారాయణ చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో చంటిబాబు భౌతికకాయాన్ని రుస్తుంబాదలోని తన నివాసానికి తరలించారు. కుమారుడి భౌతికకాయం చూసి సుబ్బారాయుడు దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి కన్నీటి వేదనను చూసి అక్కడవారు చలించిపోయారు. కుమారుడు చంటిబాబు అంటే సుబ్బారాయుడుకు అమితమైన ప్రేమ అని చెప్పుకుంటారు. గత 35 సంవత్సరాలుగా కుమారుడి కోసమే సుబ్బారాయుడు సతీమణి పూర్తి సమయాన్ని కేటాయించారు. చంటిబాబు మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదంలో మునిగిపోయింది. చంటిబాబు మరణవార్త తెలియడంతో కొత్తపల్లిని ఓదార్చడానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం రుస్తుంబాద చేరుకున్నారు. శాసనమండలి ఛైర్మన్ ఎండీ షరీఫ్, ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదరాజు, జక్కంపూడి రాజా, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకిరామ్, తదితరులు కొత్తపల్లి వరామర్శించి, చంటిబాబుకి నివాళులర్పించారు.

# టీడీపీ, వైసీపీ ట్వీట్‌ల వార్

**- ట్విట్టర్ వేదికగా ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు**

**- డ్రోన్ వస్తేనే.. హత్యకు కుట్ర పన్నినట్టా?**

**- ట్విటర్‌లో విజయసాయిరెడ్డి**

**- ముందు మీ మంత్రులకు కిన్లే బాటిల్స్ అందించండి**

**- విజయసాయి ట్వీట్‌కు కౌంటర్ ఇచ్చిన బుద్దా వెంకన్న**

అమరావతి, ఆగస్టు20(ఆంఎన్ఎ) : ఏపీలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ట్విట్ల వార్ నడుస్తుంది. విజయసాయి రెడ్డి టీడీపీ నేతలపై వ్యంగాస్త్రాలు సంధిస్తుండగా.. అదే స్థాయిలో టీడీపీ నేత బుద్దా వెంకన్న వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలపై సెటైర్లు వేశారు. దీంతో ఎవరి పార్టీ కార్యకర్తలు వారికి మద్దతు పోస్టులు చేస్తూ ట్విటర్ వేదికగా మరింత వేడిరాజస్తున్నారు. ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నివాసాన్ని డ్రోన్‌తో చిత్రీకరిస్తే.. హత్యకు కుట్ర పన్నినట్టా అని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. ఈమేరకు సోమవారం విజయసాయి ట్విట్టర్‌లో టీడీపీ నేతల తీరుపై మండిపడ్డారు. పరువు గంగ పాలవుతుందని బ్యారేజీ గేట్లను తెరవకముందే... సారూ..హైదరాబాద్ పారిపోయారంటూ ఎద్దేవా చేశారు. వరద నీటిలో బాబు ఇల్లు మునిగిపోయిందని, అందుకు డ్రోన్‌తో చిత్రీకరిస్తే..హత్యకు కుట్ర పన్నినట్టా అంటూ ప్రశ్నించారు. ఇంట్లోని విలువైన వస్తువులన్నీ తరలించారని, కృష్ణా నది కావాలనే ప్రవాహాన్ని పెంచుకొంటోందని నిందించేటట్టున్నారంటూ విమర్శించారు. మొన్నటి దాక మోదీని రాష్ట్ర శత్రువుగా ముద్ర వేసిందని, అయితే.. పచ్చ పార్టీ లీడర్లు బీజేపీలోకి దూకుతున్నారని..ఎల్లో మీడియాకు పెద్ద చిక్కొచ్చి పడిందని ట్వీట్‌లో తెలిపారు. గత పాలనలో వరదలు, తుఫాన్లు వస్తే బాబు వన్ మ్యాన్ షో నడిచేదని, సీఎం వచ్చేదాక కదలని అధికార గణం కలెక్టర్లపై ఆగ్రహం.. అంటూ కుల మీడియా ఆయన్ను ఆకాశా నికెత్తేదంటూ వెల్లడించారు. ఇప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారంటూ విమ ర్శించారు.మీ మంత్రులకు, ఎమ్మెల్యేలకు కిన్లే వాటర్ బాటిల్స్ అందించండి - బుద్దా వెంకన్న సెటైర్లు

టీడీపీ నేతలపై ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించిన విజయసాయిరెడ్డికి టీడీపీ నేత బుద్దా వెంకన్న సెటైర్లు వేశారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఎవరి పనితీరు ఏంటో ప్రజలు తేల్చుకుంటారని బుద్దా వెంకన్న అన్నారు. 'మీకు వాళ్లకు అంతకంటే ముఖ్యమైన పని ఒకటి ఉందని, వైసీపీ మంత్రులు ఎమ్మెల్యేలు వరద బాధితులను ఆదుకోవడంలో చాలా కష్టపడి, చెమటోడ్చి సహాయం చేసి, బాధితులనే కిన్లే వాటర్ బాటిల్స్ అడిగి చివాట్లు తింటున్నారట. ముందు అర్జెంట్‌గా వెళ్లి మీ మంత్రులకు, ఎమ్మెల్యేలకు కిన్లే వాటర్ బాటిల్స్ అందించండి. ఎలాగో భయపడి అమెరికా పర్యటనకు వెళ్లలేదు కదా అని విమర్శించారు.

# సొంత దేశ పరిస్థితులను చక్కదిద్దుకోండి

**ఇమ్రాన్‌కు శివసేన హెచ్చరిక**

**చైనాతో కలసి కుట్రలు చేసినా సాగలేదన్న సామ్నా**

ముంబై,ఆగస్టు20(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో ఎన్డీయే మిత్రపక్షం శివసేన మరోసారి పాకిస్తాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. చైనాతో కలసి విష ప్రచారాలు మానాలని పేర్కొంది. సొంత దేశాన్ని చక్కదిద్దుకుంటే మంచిదని ఇమ్రాన్‌కు సూచించింది.

పార్టీ సొంత పత్రిక సామ్నా వేదికగా దాయాది దేశ వైఖరిపై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. దేశ పరిస్థితుల దృష్ట్యా పాకిస్తాన్ ఇప్పటికే ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ఉందనీ... కాబట్టి పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ కశ్మీర్‌పై దృష్టి పెట్టే బదులు సొంత సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్‌ఎస్‌సీ) వద్ద పాకిస్తాన్, చైనా బొక్కబోర్లా పడ్డాయని శివసేన ఎద్దేవా చేసింది. చిరకాల మిత్రదేశాలు రెండూ ఒట్టిచేతులతో వెనుదిరిగాయంటూ యూఎన్‌ఎస్‌సీ రహస్య సమావేశాన్ని ఉద్దేశించి ఆ పార్టీ వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై... యూఎన్‌ఎస్‌సీలోని దాదాపు అన్ని దేశాలు భారత్‌ను సమర్ధించాయని శివసేన పేర్కొంది.

పాకిస్తాన్ వంటి దేశాలను వెనకేసుకొస్తూ అంతర్జాతీయ సమాజం ముందు చైనా అభాసుపాలైందని వ్యాఖ్యానించింది. యూఎన్‌ఎస్‌సీలో తిరస్కారం ఎదురైనప్పటికీ... కశ్మీర్ విషయంలో? పాకిస్తాన్ తనను తాను గాయపర్చుకునే అలవాటు మానుకోవడం లేదని శివసేన పేర్కొంది. పాకిస్తాన్ వల్ల భారత దేశానికి ముప్పు ఉందనడం పసలేని వాదనేనని కొట్టిపారేసింది. కాగా జమ్మూ కశ్మీర్‌పై భారత్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ దాదాపు అన్ని అగ్ర దేశాలనూ సంప్రదించిందనీ.. అయినా అన్ని దేశాలూ పాకిస్తాన్‌ను దూరం పెట్టాయని పేర్కొంది.

# జమ్మూకాశ్మీర్ తాజా పరిస్థితులపై కేంద్రం సమీక్ష

న్యూఢిల్లీ,ఆగస్టు20 (ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లోని భద్రతా వ్యవహారాలపై అమిత్‌షా సమీక్షించారు. అక్కడ 370 రద్దు తరవాత ప్రస్తుత పరిస్థులతతో

**ఉన్నతస్థాయి సమీక్షలో పాల్గొన్న అజిత్ ధోవల్**

**హాజరైన హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా**

**ఇతర సీనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్లు**

**పరిస్థితులను ఆరా తీసిన హోంమంత్రి అమిత్ షా**

పాటు మరికొన్ని కీలకాంశాలను చర్చించడానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో పాటు ఐబీ చీఫ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించడంతో పాటు ఇంటర్నెట్, ఫోన్ సేవలను పునరుద్ధరించడంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబాతో పాటు ఇతర సీనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్లు కూడా సమావేశానికి హాజరయ్యారు. కశ్మీర్ అంశంపై చర్చిస్తున్నట్లు సమాచారం. కొన్ని రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో కశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదా రద్దు అయ్యింది. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని రోజులుగా కశ్మీర్‌లోనే దోవల్ మకాం వేసి తాజా పరిస్తితులను అంచనా వేశారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత క్షేత్ర స్థాయి పరిస్థితులను అధ్యయనం చేయడానికి అజిత్ దోవల్ 11 రోజుల పాటు జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే అక్కడి క్షేత్రస్థాయి విషయాలపై దోవల్ హోంమంత్రి షాకు ఓ రిపోర్టును సమర్పించినట్లు సమాచారం. దీంతో తదుపరి చర్యలపై అమిత్ షా ఈ సమావేశంలో చర్చించి ఉంటారని తెలుస్తోంది.

**370 రద్దు ముమ్మాటికీ తప్పే: ఆజాద్**

జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370 అధికరణను కేంద్రం రద్దు చేయడాన్ని సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ మరోసారి తప్పుపట్టారు. ఆ రాష్ట్రంలో ఒక్కరు కూడా సంతోషంగా లేరని, దానినిబట్టే ప్రభుత్వ నిర్ణయం తప్పని రుజువైందని ఆయన అన్నారు. సోమవారం నాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, 370 అధికరణ రద్దుకు తీసుకున్న తప్పుడు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. నిర్బంధంలో ఉంచిన రాజకీయ నేతలను వెంటనే విడుదలచేయాలని, తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని ఆజాద్ డిమాండ్ చేశారు.

**షీలా రషీద్ సంచలన వ్యాఖ్యలు**

జమ్మూ కశ్మీర్‌లో తాజా పరిస్థితిపై జవహార్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి నేత షీలా రషీద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కశ్మీర్‌లో నిత్యవసరాలు అందక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని ఆమె ట్వీట్ చేశారు. స్థానిక పోలీసులకు ఎలాంటి అధికారాలు లేవని, మిలిటరీ బలగాలు హింసకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఇళ్లల్లోకి ఆర్మీ జవానులు చొరబడి యువకుల్ని అకారణంగా తీసుకెళ్తున్నారని ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుత పరిస్థితిపై పది అంశాలతో ట్వీట్ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో మీడియా ప్రసారాలు నిలిపివేశారు. గ్యాస్ స్టేషన్లు అన్నీ మూసివేశారు. మందుల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోంది. సమాచార వ్యవస్థ పూర్తిగా స్థంబించిపోయింది. ఎలాంటి సమాచారం స్థానికులకు చేరడం లేదు. డీటీహెచ్ రీచార్జి చేసుకునే వెసులుబాటు లేదు. అతికొద్ది మందికి మాత్రమే టీవీ ప్రసారాలు అందుబాటులో ఉన్నాయన్నరు. జమ్మూ కశ్మీర్ పోలీసులకు శాంతిభద్రతలపై ఎలాంటి అధికారాలు లేవు. అంతా పారామిలిటరీ దళాల చేతిలో ఉంది. సీఆర్‌పీఎఫ్ వ్యక్తి ఫిర్యాదు మేరకు ఒక స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌ను బదిలీ చేశారు. ఎస్‌హెచ్‌ఓలు వారి లాఠీలు మోస్తున్నారు. సర్వీస్ రివాల్వర్లను వారు కన్నెత్తి చూడడం లేదు. పారామిలిటరీ బలగాలు రాత్రి సమయాల్లో ఇళ్లల్లోకి ప్రవేశించి యువకుల్ని అక్రమంగా నిర్బంధిస్తున్నారు. ఇళ్లల్లో దోపిడీకి పాల్పడుతున్నారు. ఇంట్లో ఉన్న రేషన్ సరుకుల్ని చెల్లాచెదురు చేస్తున్నారు. షోఫియన్‌లో నలుగురు యువకుల్ని ఆర్మీ క్యాంప్‌లోకి పిలిచి విచారించారని తెలిపారు. ఒక మైక్ వారి దగ్గర పెట్టి వారి అరుపుల్ని ఆ ప్రాంతంలోని వారికి వినిపిస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. ఇలాంటి భయానక వాతావరణం జమ్మూ కశ్మీర్‌లో ఉందని షీలా రషీద్ ట్వీట్ చేశారు.

## వరద బాధితులను వదిలి ఫోన్ ట్యాపింగ్

**కర్నాటక రాజకీయాలపై మండిపడ్డ దేవేగౌడ**

బెంగళూరు,ఆగస్ట్20 (ఆంఎన్ఎ): రాష్ట్రంలోని ప్రజలు వరదలతో ఇబ్బందులు పడుతుంటే కర్ణాటకలోని యడియూరప్ప ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని మాజీ ప్రధాని దేవెగౌడ విమర్శించారు. ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా ఫోన్ ట్యాపింగ్ అంశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై సమగ్ర విచారణ జరగాలంటూ ఎక్కువ మంది నేతలనుంచి డిమాండ్లు రావడంతో ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్టు యడియూరప్ప ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, రాష్ట్రంలోని ప్రజలు ఓ వైపు వరదలతో ఇబ్బంది పడుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఫోన్ ట్యాపింగ్ అంశానికే ప్రాధాన్యం ఇస్తోందని, దానిపైనే ఎక్కువగా చర్చిస్తోందని దేవెగౌడ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను ప్రధానిగానూ పనిచేశా. కానీ ఇలాంటి రాజకీయాలను ఎప్పుడూ చూడలేదు. కర్ణాటక ప్రజలు వరదలతో ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఫోన్ ట్యాపింగ్ అంశంపైనే మాట్లాడుతోంది. అన్ని బాధ్యతల్నీ పక్కన పెట్టేసి కేవలం ఫోన్ ట్యాపింగ్ కేసుపైనే ఎక్కువగా చర్చ పెడుతోంది. లక్షలాది మంది వరద బాధితులకు అండగా నిలబడేలా మనమంతా ముందుకెళ్లాలి. అంతేగానీ పరస్పర నిందారోపణలు, బురదజల్లుకోవడం వంటి చర్యలు సరికాదని అన్నారు. మరోవైపు, మాజీ సీఎం కుమారస్వామి అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేడీఎస్, కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేత సిద్ధరామయ్యతో పాటు దాదాపు 300 మంది నేతల ఫోన్లను ట్యాప్ చేయించారంటూ వచ్చిన విమర్శలు కర్ణాటక రాజకీయాల్లో దుమారం రేపాయి. ఈ ఆరోపణల్ని కుమారస్వామి ఖండించారు. ఎలాంటి దర్యాప్తునైనా తాను ఎదుర్కొనేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు.

# పాక్‌లో భారత్ డిప్యూటీ హై కమిషనర్‌కు సమన్లు

**సరిహద్దుల్లో కాల్పుల విరమణ సాకుతో పాక్ దుశ్చర్య**

ఇస్లామాబాద్,ఆగస్టు20(ఆర్ఎన్ఎ): భారత డిప్యూటీ హై కమిషనర్ గౌరవ్ అహ్లూవాలియాకు పాకిస్తాన్ మరోసారి సమన్లు జారీ చేసింది. నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వద్ద భారత భద్రతా దళాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని ఆరోపిస్తూ ఆయనకు సమన్లు ఇచ్చింది. గత ఎనిమిది రోజుల్లో పాకిస్తాన్ సమన్లు జారీచేయడం ఇది ఐదోసారి.

ఎల్‌వోసీ వద్ద నాగ్రాయ్ గ్రామంలో భారత్ కాల్పులు జరిపిందనీ.. ముగ్గురు పాక్ సైనికులు చనిపోయారంటూ పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ (దక్షిణాసియా, సార్క్) మహ్మద్ ఫైజల్ అహ్లూవాలియాకు సమన్లు ఇచ్చారు.

వాస్తవానికి ఆదివారం నుంచి ఎల్‌వోసీ వద్ద పాకిస్తాన్ రేంజర్లు కాల్పులకు తెగబడుతుండగా... వాటిని భారత భద్రతా దళాలు తిప్పికొడుతున్నాయి. కాగా 2003లో ఇరు దేశాలు కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని గౌరవించాలంటూ పాకిస్తాన్‌కు భారత్ పదేపదే విజ్ఞప్తి చేస్తూ వస్తోంది. కాగా భారత దళాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయంటూ పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సమన్లు ఇచ్చిన రెండో రోజే మళ్లీ అహ్లూవాలియాకు సమన్లు అందడం గమనార్హం.

పాకిస్తాన్‌లో భారత హైకమిషనర్ అయ లేని సమయంలోనే అక్కడి ప్రభుత్వం పదేపదే సమన్లు జారీ చేయడం గమనార్హం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత రాయబారిని వెనక్కి పిలవాలంటూ పాకిస్తాన్‌ను భారత్‌ను కోరింది.

### వరదపై తెదేపా నేతలవి

# దిగజారుడు రాజకీయాలు

- సరైన సమయంలోనే దిగువకు నీటిని వదిలాం
- బాబు ఇంటిని ముంచాలనే ఆలోచన లేదు
- నీటిపారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్

అమరావతి, ఆగస్టు20(ఆంఎన్ఎ) : వరదపై తెదేపా నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, తమ వంతు పాత్రగా ప్రజలను అప్రమత్తంచేయాల్సింది పోయి.. రాజకీయ లబ్ధికోసం పాకులాడుతున్నారని ఏపీ భారీనీటిపారుదల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ విమర్శించారు. సోమవారం సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. 2009 తర్వాత రాష్ట్రంలో ఇంత భారీ స్థాయిలో ఎప్పుడూ వరదలు రాలేదని చెప్పారు. గరిష్ఠంగా 8.05లక్షల క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజ్ నుంచి వదిలినట్లు చెప్పారు. ఎక్కడికక్కడ సమన్వయం చేసుకుంటూ సరైన సమయంలోనే వరదనీటిని దిగువకు వదిలామన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు ఉంటున్న ఇంటిని ముంచాలనే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. వరదపై తెదేపా నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాయలసీమకు నీరివ్వడంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని చెప్పారు. అధికారులతో సమీక్షలు చేయడం ఒక్కటే తమ బాధ్యత కాదని.. క్షేత్రస్థాయిలో ప్రజల బాగోగులనూ పట్టించుకోవాల్సి ఉంటుందని అనిల్ వ్యాఖ్యానించారు. తెదేపా నేతలు లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. భారీగా వరదనీరు వచ్చినపుడు కొన్ని ఇళ్లు, పొలాలు మునగడం సహజమన్నారు. అధికారులు వారిపని వారు చేశారని.. తాము జోక్యం చేసుకోలేదని చెప్పారు. ప్రాజెక్టుల నుంచి నీటిని వదిలినపుడు అధికారులు కొన్ని లెక్కలు పాటిస్తారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అన్ని సహాయ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి వివరించారు.

## పంటలు గిట్టుబాటు రాక ఆందోళన

కడప,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులు దళారులచేతుల్లో దగాపడుతున్నారు. గిట్టుబాటు ధరలు ఉన్నా దళారులు మాత్రం రైతులకు ధరలు లేవని మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. దీంతో రైతులు ఉన్న ధరలతోనే సరిపెట్టుకునే దౌర్భాగ్యపుపరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులను దళారులు నిలువునా ముంచుతున్నారు. రైల్వేకోడూరులో ప్రధానంగా మామిడి, అరటి, బొప్పాయి తదితర పంటలను సాగుచేసున్నారు. ఈఏడాదిలో పకృతివైపరీత్యాలు, చీడపీడలు, దళారులు తదితరవాటితో రూ.5కోట్లు విలువచేసే అరటి ఏటిపాలు కావడంతో రైల్వేకోడూరు రైతాంగం నిలువునా నష్టపోయింది. మొన్నటి వర్షాలకు కూడా ఉన్నది ఊడ్చుకు పోయిందని వాపోయారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి తదితర మండలాల్లో వీచినగాలులకు అరటిచెట్లు పడిపోయాయి. అరటిధరలు బాగా ఉన్న సమయంలో ఇటీవల వర్షం కురిసిచెట్లు నేలకూలిపోయాయి. పక్వానికివచ్చిన గెలలు కళ్లముందే పడిపోవడంతో రైతులు విలవిలలాడారు. బొప్పాయి విషయానికి వస్తే ధరలు పూర్తిగా దళారులదే పెత్తనంగా మారింది. ఇకపోతే దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలుపెంచలేదు. మరోవైపు రైతులు దళారులతో తీవ్రంగా నష్టపోతున్నారు. అరటి, బొపాయి, మామిడికి ధరలు విషయంలో రైతులకు అనుకూలంగా ఉండాలన్నారు.

# పాఠాలుచెప్పని పలుకుబడి టీచర్లు?

### పైరవీలతో విధులకు దూరంగా కొందరు

అనంతపురం,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కొందరు టీచర్లు తమకున్న పలుకుబడి ఉపయోగించి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో డెప్యుటేషన్‌పై పాఠశాలలు వదిలి కార్యాలయాలకు అతుక్కుపోతున్నారు. అవసరం లేనిచోట కూడా ఇబ్బడి ముబ్బడిగా చేరి రెండు రోజులు డ్యూటీలో ఉంటూ మరో రెండు రోజులు సొంత వ్యాపకాల్లో మునిగితేలుతున్నారు. మరి కొందరు టీచర్లు ఏకంగా డ్యూటీకి డుమ్మాకొడుతున్నారు. రోజుల తరబడి పాఠశాల విధులు దూరంగా ఉంటున్నారు. కొందరయితే నెలల తరబడి, మరికొందరు ఏళ్ల తరబడి పాఠశాలలకు వెళ్లిన దాఖలాలు లేవు. కొందరు హెచ్ఎంలు, ఎంఈఓలతో కుమ్మక్కై జీతంలో కొంత మొత్తం ముట్టజెప్పి.. విధులకు ఎగనామం పెడుతున్నారు. ఇలాంటి వారు జిల్లాలో వందల సంఖ్యలోనే ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు డెప్యుటేషన్ పేరుతో సుమారు 40 మంది వరకు టీచర్లు స్కూళ్లకు దూరంగా ఉన్నారు. వీరిలో చాలామంది అవసరం లేకపోయినా పోస్టుల్లో కొనసాగుతున్నారు.కొందరు ఉపాధ్యాయులకు నగరంలోని సైన్స్ సెంటర్ విడిది కేంద్రంగా మారిందనే విమర్శలున్నాయి. పెద్దగా అవసరం లేకపోయినా.. పైరవీలతో అక్కడ విధుల్లో చేరిన ఉపాధ్యాయులు ఆటవిడుపులా గడుపుతున్నారు. రాజకీయ నాయకులు, అధికారుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకుని.. సైన్స్ సెంటర్‌లో డ్యూటీ వేయించుకుని పలువురు ఉపాధ్యాయులు పాఠశాలలకు దూరంగా ఉంటూ..ఏళ్ల తరబడి అక్కడే కొనసాగుతున్నారనే విమర్శలున్నాయి. స్కూల్ అసిస్టెంట్లయిన వీరి సేవలు ఉన్నతపాఠశాలల్లో చాలా అవసరం. అయితే విద్యాశాఖ ఉన్నతాధికారులు మాత్రం పైరవీలకు తలొగ్గడంతో ప్రస్తుతం కొందరు ఉపాధ్యాయులకు పునరావాస కేంద్రంగా సైన్స్ సెంటర్ మారిపోయింది. కొందరు ఉపాధ్యాయులయితే బాగానే పనిచేస్తున్నారు. సొంత ఖర్చులు పెట్టి పిల్లలకు పుస్తకాలు, ఇతర మెటీరియల్ ఇప్పించి చదువులు చెప్పేవారూ ఉన్నారు. వీరి కథ అటు ఉంచితే.. బడి డ్యూటీకి దూరంగా ఉంటున్న వారు కూడా వందల సంఖ్యలో ఉన్నారు. రియల్ ఎస్టేట్, చిట్‌ఫండ్స్, వడ్డీ వ్యాపారం తదితర వ్యాపకాల్లో ఉంటూ పాఠశాలలకు దూరంగా ఉండే వారు చాలామందే ఉన్నారు. కొందరయితే నెలల తరబడి పాఠశాల ముఖం చూడని వారున్నారు. కొందరయితే ఎంఈఓలు, హెచ్ఎంలకు ముడుపులిచ్చుకుని మరీ స్కూళ్లకు డుమ్మా కొడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకు కొత్త డీఈఓగా శామ్యూల్ నియమితులయ్యారు. ఉపాధ్యాయుల పైరవీలకు గతంలో కొందరు ఉన్నతాధికారులు తలొగ్గారనే విమర్శలున్నాయి. ఎవరైనా స్కూల్ విజిట్‌కు వెళ్లిన సందర్భాల్లో అక్కడ ఉపాధ్యాయులు గైర్హాజరై ఉంటే.. సంఘాల నేతలు ఆ విషయం చెప్పినా ఉన్నతాధికారులు పట్టించుకునే వారు కాదనే విమర్శలున్నాయి.

# అద్దె ట్యాంకర్లతో ఆడుకున్నారు

### బాగా వెనకేసుకున్నారని ప్రచారం?

అనంతపురం,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ): తాగునీటి సరఫరా మున్సిపల్ అధికారులకు కాసుల పంట కురిపిస్తోంది. దీంతో కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో లక్షలాది రూపాయల ప్రజాధనం నీటి పాలవుతోంది. టెండర్ల ప్రక్రియకు ఎగనామం పెట్టి అనధికారికంగా అ÷-దదె ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తూ అధికారులు జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు గుప్పుమన్నాయి. గత ఐదేళ్లుగా ఇదేతంతు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎండాకాలంలో మొత్తం ఇదే దందా సాగిందన్న ప్రచారం బహిరంగమే. అద్దె ట్యాంకర్లతో నీటి సరఫరా, మోటార్లు, స్టార్టర్ల మరమ్మతులకు సంబంధించి ఇష్టారాజ్యంగా ఓచర్లు సృష్టించి రూ. లక్షల్లో కొల్లగొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో పట్టణంతో పాటు గూబనపల్లి, దొడగట్ట, కురాకులతోట, ఒంటిమిద్ది, ముదిగల్లు గ్రామాలు ఉన్నాయి. ఇందులో సుమారు 55 వేల జనాభా ఉంది. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నీటితో పాటు 32 రక్షిత మంచినీటి బోరుబావులు ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో అందులో సగం బోర్లు ఎండిపోయాయి. దీంతో మిట్ట ప్రాంతాలైన ఇందిరమ్మ కాలనీ, కోటవీధి, ధర్మవరం రోడ్డు, వడ్డె కాలనీ, దేవాదుల కొండ, తదితర గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉంది. మొదట్లో మున్సిపల్ ట్యాంకర్‌తో నీటిని సరఫరాచేస్తూ వచ్చారు. జనాభాకు అనుగుణంగా తాగునీటిని సరఫరా చేయాలని గత ప్రభుత్వం ఆదేశించింది. ఇదే అదునుగా భావించిన అధికారులు రెండు అ÷-దదె ట్యాంకర్లతో పుష్కలంగా నీటిని సరఫరా చేస్తున్నట్లు కాకిలెక్కలు సృష్టించి ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు ఏడాపెడ బిల్లులు కాజేస్తున్నారనే విమర్శలు గుప్పుమన్నాయి. వేసవిలో యుద్ధ ప్రాతిపదికన నీటి సరఫరా చేసినట్లు కౌన్సిల్ అజెండాలో పొందుపరిచి లక్షలు కొల్లగొట్టారని చర్చ సాగుతోంది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అద్దె ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ తతంగం కొన్నేళ్లుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వేసవిలో నీటి ఎద్దడి నివారణకు రూ. 60 లక్షలు నిధులు మంజూరుకు నివేదిక పంపారు. కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్న నెలసరి బిల్లులో 10 శాతం పర్సెంటేజీల పేరుతో అధికారులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ ప్రముఖ ప్రజాప్రతినిధికి అండదండగా ఉన్న నాయకుడు ఏకంగా రెండు నీటి ట్యాంకర్లను మున్సిపాలిటీకి అప్పగించినట్లు సమాచారం.

# విద్యార్థి సమస్యలు పరిష్కరించాలి

### ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం

అనంతపురం,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల వద్ద వినతి పత్రాలు అందచేస్తున్న నేపథ్యంలో.. సోమవారం ఉదయం అనంతపురంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఎంఆర్ఓ కి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ రూ.3752 కోట్లను, 5 నెలల నుండి హాస్టల్ విద్యార్థులకు పెండిగ్‌లో ఉన్న కాస్మోటిక్ మెన్ ఛార్జీలను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యార్థులకు అనుగుణంగా వర్కర్లను నియమించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పునః ప్రారంభించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అక్షయపాత్ర సంస్థకు ఇవ్వకుండా, గతంలో ఏ విధంగా నడిచిందో అదేవిధంగా ఏజెన్సీల ద్వారా కొనసాగించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల కళాశాల హాస్టల్స్ లలో ఉన్న అన్ని రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు జై చంద్ర, తరుణ్, సుధీర్, చంద్ర, జగన్, మధు, అజయ్, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ వినియోగంలో కుట్ర లేదు

### వరదస్థితిని తెలుసుకేనే ప్రయత్నం: డిజిపి

విజయవాడ,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ): వరద ఉధృతిని అంచనా వేయడం కోసం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డ్రోన్ ఉపయోగించిందని డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. మాజీ సిఎం చంద్రబాబు ఇంటిపైన ఎగరేసిన డ్రోన్ వివాదంపై డీజీపీ స్పందించారు. సోమవారం డీజీపీ గౌతమ్ సవాంగ్ మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడంతో కమ్యూనికేషన్ గ్యాప్ వచ్చిందని వివరణ ఇచ్చారు. ఇందులో ఎలాంటి కుట్ర లేదని స్పష్టం చేశారు. దీనిని రాజకీయం చేయొద్దని.. ఇరిగేషన్ అధికారులకు, స్థానిక పోలీసులకు మధ్య సమన్వయం లేని కారణంగానే ఈ వివాదం నెలకొందని తెలిపారు. ఇకపై డ్రోన్ ఉపయోగించాలంటే స్థానిక పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీజీపీ గౌతమ్ సవాంగ్ పేర్కొన్నారు.

# నేరుగా మద్యం అమ్మకాలపై దృష్టి

### భారీగా ధరలు పెరుగుతాయన్న ఆందోళన

గుంటూరు,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క మద్యం నియంత్రి స్తామంటూనే మరో పక్క ధరలను విపరీ తంగా పెంచేందుకు రంగం సిద్ధం చేస్తోంది. చీప్ లిక్కర్ నుంచి హై క్లాస్ బ్రాండ్ వరకు ఆల్ ప్రీమియం బ్రాండ్స్ ధరలు అక్టోబర్ నుంచి మోతమోగనున్నాయి. అక్టోబర్ నుంచి ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగి మద్యం దుకాణాలను నిర్వహించనుంది. అందుకోసం విధివిధానాలను ఖరారు చేయాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఉన్నతాధికా రులు కేరళ, తమిళనాడు తరహాలో ఒక పాలసీని, అచ్చంగా ప్రభుత్వ మే మద్యం అమ్మకాలు చేపడితే ఉండే విధంగా మరోపాలసీని సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేయనున్నట్లు తెలిసింది. దీని ప్రకారం జిల్లాలో 20శాతం మద్యం షాపులకు కోత విధించనున్నారు. మద్యం ధరల ఎమ్మార్పీని భారీగా పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటి వరకు ఐఎంఎల్ డిపో ద్వారా అందిస్తున్న ప్రతి బ్రాండ్ మద్యానికి క్వార్టర్‌కు కనీసం రూ.50కి పైనే పెంచనున్నారు. అన్ని ప్రీమియం బ్రాండ్లతో పాటు చీప్ లిక్కర్ ధర కూడా భారీగా పెరగనుంది. జిల్లాలో ప్రస్తుతం మద్యం అమ్మకాల ద్వారా నెలకు రూ.4 కోట్ల మేర ఆదాయం వస్తోంది. అక్టోబర్ నుంచి మరో రూ. 6 కోట్ల మేర ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అయితే బార్‌లకు మాత్రం 2022 మార్చి 31 వరకు ఎటువంటి మార్పు ఉండదు. ఆ తరువాతే వాటిపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అప్పటివరకు వైన్‌షాపులలో మద్యం రేట్లను భారీగా పెంచే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ అధికారి ఒకరు తెలిపారు. జిల్లాలో మద్యంషాపులు తగ్గించడంతో, మద్యం రేట్లు పెంచడంతో కాపుసారా, గుడుంబా వంటి పల్నాడు, డెల్టా ప్రాంతాల నుంచి భారీగా సరఫరా అయ్యే అవకాశం ఉంది. ఇక ఎక్సైజ్‌శాఖ అధికారులు వీటి నియంత్రణ కోసం పని చేయాల్సి ఉంటుంది. జిల్లాలో వెయ్యి మందికిపైగా మద్యం షాపుల నిర్వహణ ద్వారా ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ప్రతి షాపులో ముగ్గురు నలుగురు చొప్పున ఉద్యోగాలు కల్పిస్తున్నారు. వీరితో పాటు ప్రతి షాపుకు ఒక సూపర్‌వైజర్‌ను నియ మించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలహామీ ల్లో భాగంగా మద్యం నిర్వహణ ప్రభుత్వమే చేపట్టి విడతల వారీగా మద్య నిషేధాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగానే మొదటి సంవత్సరం 20శాతం మద్యం దుకాణాలను ఎత్తివేస్తుంది. దశలవారీగా షాపులను మరింతగా తొలగించే అవకాశం ఉందని ప్రభుత్వమే ప్రకటిస్తోంది.

# రేషన్ కార్డుల తొలగింపు తగదు: సిపిఐ

అనంతపురం,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): అనంతపురం జిల్లా హిందూపురం పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దాదాపీర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సర్వేల పేరుతో రేషన్ కార్డులను తొలగించడం తగదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డులు అందించి రేషన్ సరుకులను కుటుంబాలకు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తండ్రి బాటలోనే పరిపాలన చేస్తానంటూ.. పేదల కడుపు కొట్టడం తగదన్నారు. ప్రతి పాఠశాలలోనూ పల్స్ సర్వే కేంద్రాలను ఏర్పాటు చేసి సర్వే చేయించాలన్నారు. రేషన్ కార్డు లేని ప్రతి కుటుంబానికి రేషన్ కార్డును అందించాలని దాదాపీర్ కోరారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలను కేటాయిస్తూ.. ప్రభుత్వం గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనను ఉధృతం చేస్తామని దాదాపీర్ హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిపిఐ నేతలు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శివ కృష్ణ, కెటి.శ్రీనివాస్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్రెడ్డి, పెద్ద ఎత్తున సిపిఐ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పట్టణ సచివాలయాలతో నిరుద్యోగులకు ఉపాధి

### 459 వార్డు సచివాలయాల ఏర్పాటుకు రంగం సిద్ధం

గుంటూరు,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ సంక్షేమ పథ కాలను క్షేత్ర స్థాయిలో నేరుగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను రూపుది ద్దుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రెండు వేల మందికి ఒకటి చొప్పున సచివాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. పట్టణాల్లో ఆ పరిమితిని నాలుగు వేలకు పెంచింది. నాలుగు వేల జనాభాకు ఒక వార్డు సచివాల యం ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లాలోని 12 పురపాలక సంఘాలు, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 459 వార్డు సచివాలయాలఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ప్రధానంగా ఆయా వార్డుల్లో ఉన్న ప్రభుత్వ భవనాలలో వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జిల్లాలో పట్టణ సచివాలయాల ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సచివాలయాల ఏర్పాటుకు అవసరమైన భవనాల పరిశీలనలో కమిషనర్లు, మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. పట్టణ ప్రాంతాల్లో 4 వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక వేళ వార్డులో (ప్రాంతంలో) 3 వేల జనాభా ఉంటే ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేస్తారు. ఆరు నుంచి ఎనిమిది వేల జనాభా ఉంటే రెండు సచివాలయాలు ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఒక డివిజన్ (కార్పొరేటర్ పరిధి)లో 10 వేల వరకూ జనాభా ఉండే అవకాశాలు ఉన్నాయి. అటువంటి చోట 2 నుంచి 3 సచివాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 12 పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలో, గ్రామీణ ప్రాంతాల్లో 2011 జనాభా లెక్కలను దృష్టిలో ఉంచుకొని సచివాలయాలను ఖరారు చేస్తున్నారు. జాతీయ స్థాయిలో జనాభా పెరుగుదల ఏటా 10.98 శాతంగా ఉంది. దానిని ప్రాతిపదికగా తీసుకొని 2011 జనాభా ప్రకారం ఇప్పుడు జిల్లాలోని 12 పురపాలక సంఘాలు, గుంటూరు నగరపాలక సంస్థలో జనాభాపై అంచనాలు వేశారు. వాటి ప్రకారం సుమారు 459 పట్టణ సచివాలయాలు ప్రారంభించాల్సి ఉంటుందని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు అధికారులు చెప్పారు.

## పెనమలూరు వరదప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

విజయవాడ,ఆగస్ట్20 (ఆంఎన్ఎ): కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలైన యలమలకుదురు, పెద్ద పులిపాకలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి సోమవారం పర్యటించారు. యలమలకుదురులో డంపింగ్ యార్డును ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..పెద పులిపాక వరకు రిటర్నింగ్ వాల్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. కృష్ణమ్మ శాంతించడంతో సహాయక చర్యలు ముమ్మరం చేశామని చెప్పారు. అంటువ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శానిటేషన్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నా యని..రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు.

# ఆకస్మిక దాడిలో ఎర్రదొంగల అరెస్ట్

కడప,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): చెన్నూరు అటవీ ప్రాంతంలో పోలీస్, ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. సోమవారం ఉదయం డిఎస్పి సూర్య నారాయణ మీడియాతో మాట్లాడుతూ... కైలాసగిరి ప్రాంతం నుంచి స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో పోలీసులకు ఏడుగురు స్మగ్లర్లు తారసపడ్డారని, వారు పోలీస్ అటవీ శాఖ సిబ్బంది పై కర్రలతో దాడి చేశారని తెలిపారు. ఈ దాడుల్లో ఇద్దరు స్మగ్లర్లు పరారు కాగా, అయిదుగురు స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. స్మగ్లర్ల వద్ద నుండి రవాణాకు సిద్ధంగా ఉంచిన రూ.60 లక్షలు విలువ చేసే ఎర్రచందనం దుంగలను, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్మగ్లర్ లాల్ జాన్ బాషా పై జిల్లా వ్యాప్తంగా 42 కేసులు నమోదయ్యాయన్నారు. నిందితులను ఎస్పీ కార్యాలయ ఆవరణలో మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలను వెల్లడించారు.

# ఇకనుంచి వైఎస్సార్ పెళ్లి కానుక

అమరావతి,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): పథకాల పేర్లు మార్పులో ఏపీ ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. తెదేపా హయాంలో ప్రవేశపెట్టిన చంద్రన్న పెళ్లి కానుక పథకం పేరును మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ఈ పథకాన్ని వైఎస్సార్ పెళ్లికానుకగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాల పేర్లను మారుస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పథకం పేరును వైఎస్సార్ పింఛను కానుకగా, మధ్యాహ్న భోజన పథకం పేరును వైఎస్సార్ అక్షయపాత్రగా మార్చారు.

# వాలీబాల్ ఏర్పాట్లు పూర్తి చేయాలి: మంత్రి

శ్రీకాకుళం,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఎన్టీఆర్ మైదానంలో జరగనున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు వస్తున్నారని, వారికి తాగు నీరు, భోజనం, వసతి, వైద్య సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

# తప్పులు సరిచేసేనా?

### మున్సిపల్ వార్డులపై అయోమయం

ఆదిలాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): ఒక పక్క మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటే అధికారుల వైఫల్యంతో మున్సిపల్ ఓటర్ల జాబితాలో అనేక తప్పులు దొర్లి రాజకీయ అవకాశం ఎదురు చూస్తున్న ఆశావహులకు తీవ్ర అసంతృప్తి ఎదురవుతోంది. ఇప్పటికే జాబితా సవరణకు రెండుసార్లు అభ్యంతరాల స్వీకరణకు గడువును ఇవ్వగా రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం త్వరలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తుంటే అధికారులు మాత్రం తప్పుమీద తప్పు చేస్తూ రాజకీయ ఆశావహులతో పాటు పట్టణంలోని ఓటర్లను ఆందోళనకు గురిచేస్తున్నారు. అయితే తమ ఓట్లు ఏకాలనీలో ఉన్నాయో, అసలు ఉన్నాయో లేవోనని ఓటర్లు మున్సిపల్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉంటే పక్కద్బందీగా మున్సిపల్ ఓటర్ జాబితాను సిద్ధం చేయాల్సిన మున్సిపల్ అధికారులు జాబితా తయారీలో అలసత్వం ప్రదర్శించడంతో బతికి ఉన్న వారి ఓట్లు రాక పోగా మరణించిన వారి ఓట్లు జాబితాలో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. అధికారులు ప్రకటించిన ఓటరు జాబితా తారుమారుకాగా తమ ఓట్లు ఎక్కడున్నాయోనని తెలుసుకునేందుకు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని పాత 36 వార్డులు, కొత్త 13 వార్డులు మొత్తం 49 వార్డుల్లో కులాల వారీగా నిర్ధారిం చి ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. అయితే ఇందులో మైనార్టీలను, బీసీలను ఎస్సీలుగా జాబితాలో పేర్కొనడంతో ఇది చూసిన ఆశావహులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఒక్కసారిగా విస్మయానికి గురవుతున్నారు.

# వర్షాలతో చెరువులకు జలకళ

## భూగర్భ జలాలు పెరిగాయన్న ఎమ్మెల్యే

కరీంనగర్,ఆగస్ట్20 (ఆంఎన్ఎ): వర్షాలతో గ్రామాల్లో చెరువులకు జలకళ వచ్చిందని, పలు ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిండాయని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. అలాగే భూగర్భ జలాలలు పెరుగుతున్నాయని అన్నారు. కాళేశ్వరం పనులకు కొంత ఆటంకం ఏర్పడిందన్నారు. తెలంగాణలో ఉద్యమ స్ఫూర్తితో ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల ఏర్పాటుతో కరువు ప్రాంతాల్లోని భూములు బంగారు మాగాణులుగా మారుతాయన్నారు. మరో ఐదారు నెలల్లో కాళేశ్వరం ప్రాజెక్ట పూర్తవుతుందని, వచ్చే ఏడాది నుంచి నీరు అందిస్తామన్నారు. కరువు ప్రాంతాలను కూడా బంగారు మాగాణులుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన తెలంగాణలో రైతాంగం బాగుండి, రాష్ట్రమంతా సస్యశ్యామలంతో ఉండాలనే ధ్యేయంతో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రాజెక్టులు కడితే దశాబ్దాల పాటు సాగేవని... తెలంగాణ ప్రభుత్వం అలా కాదని, నాలుగు సంవత్సరాల్లో ప్రాజెక్టులు పూర్తిచేసి సాగు, తాగు నీరు అందజేసేందుకు కృషిచేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు పోచంపాడ్ ప్రాజెక్టును కట్టేందుకు 37 సంవత్సరాల సమయం తీసుకున్నారని, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి మూడున్నర సంవత్సరాలు కావస్తుందని, మరో ఆరు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. వచ్చే సంవత్సరం నుంచి సాగు నీరు అందజేస్తామని, వర్షాలు కురవకున్నా సాగుకు ఢోకా లేదన్నారు. కాళేశ్వరం ద్వారా రాష్ట్రంలో మొత్తం 37 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. రాష్ట్రంలోని రైతాంగ సంక్షేమానికి కృషిచేస్తున్న సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ నాయుకులు విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులను అడ్డం పెట్టుకొని కాలం వెల్లదీశారని, స్వరాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంత ఖర్చయినా పూర్తి చేసేందుకు వెనుకాడడం లేదన్నారు.

## బోయినపల్లి ప్రమాదంలో మైనర్ అరెస్ట్

హైదరాబాద్,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై వెళుతున్న ఆటోను రాంగ్ రూట్‌లో వచ్చిన కారు అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న వ్యక్తులు, డ్రైవర్ పరారయ్యారు. మృతుల్లో చిన్నారి ఉన్నట్లు తెలిసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారును మైనర్లు మద్యం మత్తులో నడిపినట్లు పోలీసులు గుర్తించారు. కారులో మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. నలుగురు మైనర్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇందులో ఒకరిని అదుపులోకి తసీఉకున్నట్లు సమాచారం.

# కేఏ పాల్‌కు అరెస్ట్ వారెంట్ జారీ

మహబూబ్‌నగర్, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు.. ప్రపంచ శాంతి దూతగా చెప్పుకునే కేఏ పాల్‌పై మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కేఏ పాల్ సోదరుడు డేవిడ్ రాజు హత్య కేసులో ఆయనకు అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. డేవిడ్ రాజు హత్య కేసులో తొమ్మిదవ నిందితుడిగా కేఏ పాల్ ఉన్నారు. సోమవారం కోర్టు విచారణ జరిగింది. అయితే విచారణకు పాల్ హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీచేసింది. ఈ కేసు విచారణ కోసం మిగతా నిందితులు కోర్టుకు హాజరవుతున్నా కేఏ పాల్ మాత్రం హాజరుకాట్లేదు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు ఆయనకు వారెంట్ జారీ చేసింది. 2010 ఫిబ్రవరిలో మహబూబ్‌నగర్ జిల్లా కొమ్మిరెడ్డిపల్లి వద్ద రోడ్డుపై ఆగిఉన్న కారులో కేఏ పాల్ తమ్ముడు డేవిడ్ రాజు అనుమానాస్పద స్థితిలో చనిపోగా.. ఈ కేసు విషయంలో అప్పట్లో కేఏ పాల్ ను అరెస్ట్ కూడా చేశారు. డేవిడ్ రాజుకు, కేఏ పాల్ కు మధ్య ఆస్తి తగాదాలున్నాయి. ఆస్తి తగాదాల కారణంగానే డేవిడ్ రాజును కేఏ పాల్ హత్య చేయించి ఉంటారని అప్పట్లో అనుమానించిన పోలీసులు కేఏ పాల్ ను అరెస్ట్ చేశారు. తరువాత బెయిల్ సౌ బయటకు వచ్చిన కేఏ పాల్ కు విచారణ కోసం కోర్టుకు హాజరవ్వాల్సిందిగా పలు మార్లు నోటీసులు పంపింది కోర్టు. అయినా కూడా ఆయన స్పందించకపోవడంతో ఈసారి అరెస్ట్ వారెంట్ జారీచేసింది.

## కమల్‌నాథ్ మేనల్లుడు

# రతుల్ పూరీ అరెస్టు

### - అదుపులోకి తీసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు



న్యూఢిల్లీ, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మేనల్లుడు రతుల్ పూరీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరెట్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు.

రతుల్ పూరీ, మరో నలుగురు కలిసి 'మోసెర్ బేర్' అనే సంస్థ పేరుతో వివిధ బ్యాంకుల నుంచి రూ.354 కోట్ల రుణాలు తీసుకుని వాటిని దుర్వినియోగం చేసినట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీబీఐకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రతుల్ పూరీ, డైరెక్టర్లు నీతా పూరీ, సంజయ్ జైన్, వినీత్ శర్మపై అభియోగాలు దాఖలు చేశారు.

బ్యాంకులను మోసం చేసిన కేసుతో పాటు రతుల్ పూరీ వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. యూపీయే ప్రభుత్వ హయాంలో జరిగిన అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో కూడా లంచాలు తీసుకున్నట్లు రతుల్‌పై అభియోగం దాఖలైంది. అయితే వీటితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన చెప్పుకొస్తున్నారు. అగస్టా కేసులో రతుల్‌కు సోమవారం సమన్లు అందజేసిన సీబీఐ, ఒకరోజు తిరగకుండానే మంగళవారం బ్యాంకులను మోసగించిన కేసులో ఆయన్ను అరెస్టు చేసింది.

# టిఆర్ఎస్‌లో ఉలిక్కిపాటు

## కెటిఆర్‌కు నడ్డా తెలియకపోవడం రాజకీయ అవివేకం

### మండిపడ్డ ఆచారి

మహబూబ్‌నగర్,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో బీజేపీ బహిరంగసభ విజయవంతం కావడం, బీజేపీలోకి పలువురు నేతల చేరికలను చూసి టీఆర్ఎస్ నాయకులకు భయం పట్టుకుందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి, జాతీయ బిసి కమిషన్ సభ్యుడు ఆచారి అన్నారు. నడ్డా ఎవరో తెలియదని కెటిఆర్ అన్నంత మాత్రాన బిజెపికి వచ్చే నష్టం లేదన్నారు. అయితే నడ్డా ఎవరో తెలుసుకోవాల్సిన అవసరం కూడా కెటిఆర్‌కు ఉందన్నారు. బీజేపీ ఎదుగుదలను అధికారపార్టీ జీర్ణించుకోలేకపోతున్నదన్నారు. విద్యార్థి ఉద్యమాలు చేసి వచ్చిన వ్యక్తి నడ్డాపై కేటీఆర్ తన స్థాయిమరచి విమర్శలు చేస్తున్నారన్నారు. కేటీఆర్‌లా నడ్డా అమెరికా నుంచి ఊడిపడలేదన్నారు. ఒక ప్రాంతీయ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు.. ఓ జాతీయ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరు తెలియలేదంటే రాజకీయాల్లో ఆయన స్థానం ఏపాటిదో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. నడ్డా ఎవరో అని మాట్లాడటం అధికార దురహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి భజనపరులైన కొందరు మంత్రులు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని లక్ష్మణ్ మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందంటే అధికార టీఆర్ఎస్ ఎందుకు ఉలికిపడుతోందని ఆచారి ప్రశ్నించారు. గత కొంతకాలంగా తాము పదేపదే ఈ ఆరోపణలు చేస్తూనే ఉన్నామని అన్నారు. తెలంగాణ ప్రజలకు మిషన్ కాకతీయ అనేకంటే.. కమీషన్ కాకతీయ అంటేనే బాగా అర్థమవుతోందని ఆయన అన్నారు. గతంలో చేసిన పనులకే బిల్లులు తీసుకున్నారని 2017లో కాగ్ వెల్లడించింది వాస్తవం కాదా? అని లక్ష్మణ్ ప్రశ్నించారు. అవినీతిని ప్రశ్నించినందుకే టీఆర్ఎస్ నేతలు జంకుతున్నారన్నారు. కాళేశ్వరంలో అవినీతి లేకపోతే డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) లేకుండానే ఎందుకు టెండర్లకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు.అవినీతిపై రుజువులు కావాలంటే..విచారణ చేయించి, నిజాయితీ చాటుకోవాలని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఆ నలుగురిపాలు అయిందని ఆచారి ఆరోపించారు. తెలంగాణను కల్వకుంట్ల కుటుంబం నుంచి విముక్తి చేయడానికి ఉద్యమకారులు మళ్లీ కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారని దుయ్యబట్టారు. బీజేపీలో చేరడానికి నేతలు, కార్యకర్తలు రావడం పెను మార్పు అని అభివర్ణించారు.

## బ్రాహ్మణ వెల్లెంల పథకానికి తక్షణమే నిధులు

### కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్

నల్లగొండ,ఆగస్ట్20 (ఆంఎన్ఎ): ఉదయసముద్రం -బ్రాహ్మణ వెల్లెంల ఎత్తిపోతల పథకానికి తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈప్రాంత రైతులకు మేలు చేకూర్చే ఈ పథకం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఇందుకోసం రైతు పాదయాత్రను తలపెట్టానని తెలిపారు. నిధుల కొరతతో 12 ఏళ్లుగా అసంపూరిగా ఉన్న ఈ పథకం కోసం ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు 5వేల మంది రైతులతో పాదయాత్ర చేయాలని నిర్ణయించానని, ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ డీజీపీకి లేఖ అందజేశారు. బ్రాహ్మణ వెల్లెంల నుంచి హైదరాబాద్ జలసౌధ వరకు 100 కిలోమీటర్లుఈ పాదయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అయితే పాదయాత్రకు అనుమతి ఇచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు కోమటిరెడ్డి భావిస్తున్నారు. మతి ఇవ్వకపోతే హైకోర్టుకు వెళ్లే ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం. దీనిపై కోమటిరెడ్డి మాట్లాడుతూ..12 ఏళ్లుగా బ్రాహ్మణ వెల్లెంల ఎత్తిపోతల పథకం పెండింగ్‌లో ఉందని, కరువు పీడిత ప్రాంతం కావడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా పాదయాత్ర చేసి తీరతానన్నారు.

# దేశవ్యాప్తంగా హైఅలర్ట్

### - దేశంలోకి నలుగురు ఉగ్రవాదులు
### - ఐబీ హెచ్చరికలతో అన్ని రాష్ట్రాల్లో హైఅలర్ట్
### - నలుగురి ఊహాచిత్రాలను విడుదల చేసిన ఐబీ
### - గుజరాత్‌లో వీరు తలదాచుకున్నట్లు అనుమానాలు

న్యూఢిల్లీ, ఆగస్టు20(ఆంఎన్ఎ) : నలుగురు ఉగ్రవాదులు దేశంలోకి చొరబడ్డారని, పలు ప్రాంతాల్లో వారు విధ్వంసాన్ని సృష్టించే అవకాశాలు ఉన్నాయని ఐబి హెచ్చరికలతో దేశవ్యాప్తంగా హై అలర్ట్ హెచ్చరించారు. ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టులతో పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్ సహా నలుగురు తీవ్రవాదులు గుజరాత్ తీరం నుంచి భారత్‌లోకి ప్రవేశించారని దేశంలోని అన్ని రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసింది. ఈ నెల మొదటి వారంలోనే వారు దేశంలోకి చొరబడినట్లు తమకు కీలక సమాచారం అందిందని కేంద్ర నిఘావర్గాలు వెల్లడించాయి. ఆ నలుగురూ ఏసమయంలోనైనా విధ్వంసక చర్యలకు తెగబడే అవకాశముందని నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో దేశవ్యాప్తంగా హై అలెర్ట్ ప్రకటించారు. ప్రధానంగా గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్రపై ఆ దుండగులు దృష్టి పెట్టినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) హెచ్చరించింది. ఈ మేరకు గుజరాత్ యాంటీటెర్రరిస్ట్(ఏటీఎస్) బృందానికి సమాచారమందించింది. దుండగులకు సబంధించిన ఊహాచిత్రాలను కూడా గుజరాత్ ఏటీఎస్ పోలీసులకు ఐబీ అందించింది. ఆర్టికల్ 370 రద్దు, జమ్మూ కశ్మీర్ విభజన తర్వాత.. దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆగష్టు 15 సందర్భంగా ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా స్వాతంత్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకొన్నాం అని ఊపిరి పీల్చుకునే లోగానే.. ఇంటెలిజెన్స్ బ్యూరో మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. గుజరాత్ తీరం నుంచి నలుగురు అఫ్ఘాన్ ఉగ్రవాదులు, ఒక ఐఎస్ఐ ఏజెంట్ దేశంలోకి చొరబడ్డారని తెలిపింది. వీరు దాడులకు తెగబడొచ్చని హెచ్చరించింది. దీంతో గుజరాత్‌తోపాటు దేశమంతటా హై అలర్ట్ ప్రకటించారు. గుజరాత్, మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో ముందు జాగ్రత్త చర్యగా తనిఖీలను ముమ్మరం చేశారు. అప్రమత్తంగా ఉండాలని మధ్యప్రదేశ్‌లోని అన్ని జిల్లాల ఎస్పీలకు అడిషనల్ డీజీపీ కైలాశ్ మక్వానా నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఉగ్రవాదులు చొరబడ్డారనే సమాచారంతో దేశంలోని ప్రధాన నగరాల్లోని హోటళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు సహా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలని నిఘా వర్గాలు కోరాయి. ముఖ్యమైన ప్రాంతాల్లో నిఘా పెంచాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే ప్రశ్నించాలని, వాహనాలను తనిఖీ చేయాలని కేంద్రం సూచించింది. దీంతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ పోలీసులు అప్రమత్తమయ్యారు.

# ఇమ్రాన్ రెచ్చగొట్టొద్దు : డోనాల్డ్ ట్రంప్



హైదరాబాద్, ఆగష్టు 20: ప్రధాని నరేంద్ర మోదీ, పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దుతో వివాదాస్పదంగా మారిన కశ్మీర్ అంశంపై అగ్రరాజ్యాధినేత ఇద్దరితోనూ చర్చించారు. ఈ విషయాన్ని ట్రంప్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇద్దరు మంచి మిత్రులు.. భారత్, పాకిస్థాన్ ప్రధానులతో ఫోన్‌లో మాట్లాడినట్లు ట్రంప్ తెలిపారు. వాణిజ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యం అంశాలను చర్చించినట్లు చెప్పారు. కశ్మీర్ అంశంలో రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నం చేయాలని కోరినట్లు ట్రంప్ తన ట్వీట్‌లో తెలిపారు. పరిస్థితి కొంత ఆందోళనకరంగానే ఉన్నా.. కానీ ఇద్దరితోనూ మంచి సంభాషణ జరిగినట్లు ట్రంప్ పేర్కొన్నారు. మొదట ట్రంప్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడారు. పాక్ ప్రధాని వాడుతున్న భాష గురించి ట్రంప్‌కు మోదీ ఫోన్‌లో చెప్పారు. ఇమ్రాన్ రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నట్లు మోదీ తన ఫోన్ సంభాషణలో పేర్కొన్నారు. అయితే మోదీతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత.. ఇమ్రాన్‌తోనూ ట్రంప్ ఫోన్ మాట్లాడారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని.. మృదువుగా సంభాషించాలంటూ ఇమ్రాన్‌తో ట్రంప్ పేర్కొన్నారు. కశ్మీర్ అంశంపై రెండు దేశాలు సంయమనం పాటించాలంటూ వైట్‌హౌజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నది.

## అక్రమంగా ఉగ్రవాదుల చొరబాటు

### గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఐబి హెచ్చరిక

న్యూఢిల్లీ,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ): గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబి) హెచ్చరికలు జారీ చేసింది. దేశంలోకి నలుగురు వ్యక్తులు చొరబడినట్లు గుజరాత్ ఏటీఎస్‌ను ఇంటెలిజెన్స్ బ్యూరో అప్రమత్తం చేసింది.

ఈ నలుగురు వ్యక్తులు ఆఫ్గానిస్థాన్ నుంచి గుజరాత్ తీరం ద్వారా దేశంలోకి చొరబడినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నెల మొదటి వారంలోని దేశంలోకి వారు చొరబడ్డారని తెలుస్తోంది. ఆగస్టు 15 నాడే దాడులకు పాల్పడొచ్చని ఐబీ భావించింది. నలుగురి ఛాయాచిత్రాలను స్థానిక పోలీసులకు ఐబీ అందించింది. వీరు ఏ క్షణంలోనైనా దాడులకు పాల్పడొచ్చని ఐబీ హెచ్చరికలు జారీ చేసింది. వాహన తనిఖీలు, నాకాబందీతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

### ఈ నెల 23న హైదరాబాద్ లో పెన్షన్ అదాలత్ ను నిర్వహిస్తున్న

## అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ ప్లొరేషన్ అండ్ రిసర్చ్

హైదరాబాద్, ఆగస్టు 20: పెన్షన్ అదాలత్ ను ఈ నెల 23వ తేదీ నాడు ఉదయం 10గంటల 30 నిముషాల నుండి అదే రోజు సాయంత్రం 4 గంటల మధ్య కాలం లో నిర్వహించనున్నట్లు భారత ప్రభుత్వ పరమాణు శక్తి విభాగం లో భాగం గా ఉన్న అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ ప్లొరేషన్ అండ్ రిసర్చ్ తెలిపింది. ఈ కార్యక్రమం హైదరాబాద్ లోని బేగంపేట్ లో గల సంస్థ ప్రధాన కార్యాలయమైన ఎఎమ్ డి కాంప్లెక్స్ లో ఉంటుంది. పింఛన్ కు సంబంధించి ఏవైనా ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఎఎమ్ డి పెన్షనర్ లు / ఫ్యామిలీ పెన్షనర్ లు వారి సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ పెన్షన్ అదాలత్ కు హాజరు కావచ్చు. వారు వారి యొక్క ఇబ్బందులను జీసీ-తితితి.జీఎటఏణసీల.తిని అనే ఇ-మెయిల్ ఐడి ద్వారా ముందస్తుగానే తెలియజేయవచ్చని కూడా ఎఎమ్ డి పరిపాలనాధికారి సూచించారు.

# డెబిట్ కార్డులు ఎత్తివేయనున్న ఎస్‌బీఐ




హైదరాబాద్, ఆగష్టు 20: బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి డెబిట్ కార్డులను ఎత్తివేయనున్నారు. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించే నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెబిట్ (ఎస్‌బీఐ) కార్డులను పూర్తిగా రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. ఎస్‌బీఐలో ఎక్కువ శాతం కస్టమర్లు డెబిట్ కార్డులను వినియోగిస్తున్నారు. తాము డెబిట్ కార్డులను సంపూర్ణంగా తొలగించాలని భావిస్తున్నట్లు ఆ బ్యాంక్ చైర్మన్ రజనీశ్ కుమార్ తెలిపారు. దేశంలో 90 కోట్ల డెబిట్ కార్డులున్నాయి. మరో 3 కోట్ల క్రెడిట్ కార్డులన్నాయన్నారు. యోనో యాప్‌తో డెబిట్ కార్డులకు స్వస్తి పలకాలని ఎస్‌బీఐ భావిస్తున్నది. యోనో ప్లాట్‌ఫామ్‌తో ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ల వద్ద క్యాష్‌ను డ్రా చేసుకునే సౌకర్యం కల్పించనున్నారు. ఏదైనా షాపు వద్ద కొనుగోలు చేయాలంటే కూడా యోనో ప్లాట్‌ఫామ్‌ను వాడే వీలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా 68వేల యోనో క్యాష్ పాయింట్లు ఉన్నట్లు ఆయన చెప్పారు.

# నర్సారెడ్డిని పరామర్శించిన అల్లోల

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పీ.నర్సారెడ్డిని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. నర్సారెడ్డి మనవడు ప్రత్యూష్ రెడ్డి ఇటీవల అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని నర్సారెడ్డి నివాసంలో ఆయనను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నర్సారెడ్డితోపాటు ఆయన కుటుంబసభ్యులను మంత్రి ఇంద్రకరణ్ ఓదార్చారు.

క్రీడలు

# శ్రీకాంత్, సాయి ప్రణీత్, ప్రణయ్ ముందంజ



బాసెల్ (స్విట్జర్లాండ్): బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు శుభారంభం చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయి ప్రణీత్, కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్ విజయం సాధించి ముందడుగేశారు. ప్రపంచ 19వ ర్యాంకర్ సాయి ప్రణీత్ 21-17, 21-16తో ఆంటోనీ హోసూ (కెనడా)ను వరుస గేమ్‌ల్లో చిత్తు చేశాడు. 40 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలిగేమ్ ప్రారంభంలో పోరు హోరాహోరీగా జరిగింది. 8-7కు చేరుకున్న ప్రణీత్ ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. కండ్లు చెదిరే షాట్లతో ప్రత్యర్థిని బెంబేలెత్తిస్తూ వరుసగా తొమ్మిది పాయింట్లు సాధించాడు. పదునైన స్మాష్‌లు, చురుకైన డ్రాప్‌లతో ఆకట్టుకున్నాడు. అయితే అంత త్వరగా ఓటమిని అంగీకరించని ఆంటోనీ కడదాక పోరాడాడు. చక్కటి ప్రతిఘటన కనబరుస్తూ ఆధిక్యాన్ని తగ్గించాడు. ఫలితంగా చివరికి ప్రణీత్ 21-17 తేడాతో తొలిగేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లోనూ సేమ్ సీన్ రిపీట్ అయింది. ఆరంభంలో ఇరువురు ఆటగాళ్లు ఆధిక్యం కోసం తీవ్రంగా శ్రమించారు. దీంతో గేమ్ హోరాహోరీగా సాగింది. ఒక దశలో 11-9తో ఆధిక్యం దక్కించుకున్న ప్రణీత్ ఇక అక్కడి నుంచి వెనుదిరిగి చూడకుండా చకచకా పాయింట్లు సాధించుకుంటూ ఆఖరికి 21-16తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.

సత్తచాటిన ప్రణయ్..

మరో మ్యాచ్‌లో ప్రపంచ 30వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 17-21, 21-10, 21-11 తేడాతో 93వ ర్యాంకర్ ఇటూ హీనో(ఫిన్లాండ్)పై నెగ్గాడు. 59 నిమిషాల పాటు జరిగిన పోరులో తొలి గేమ్ ఆసాంతం తడబడిన ప్రణయ్.. 17-21తో కోల్పోయి ఉత్కంఠ రేపాడు. అయితే రెండో గేమ్‌లో పుంజుకొని 5-5 నుంచి 17పాయింట్లు సాధించి.. ప్రత్యర్థికి ఐదు పాయింట్లు మాత్రమే ఇచ్చి 21-10తో సునాయాసంగా గెలిచాడు. మూడో గేమ్‌లో తొలి నుంచి ఆధిపత్యం ప్రదర్శించి ముందడుగేశాడు. రెండో రౌండ్‌లో లిన్‌డాన్ (చైనా)తో ప్రణయ్ తలపడనున్నాడు.

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత జోడీ జక్కంపూడి మేఘన-ఎస్.పూర్విషా రామ్ 21-10, 21-18 తేడాతో దయానా కోర్లెటో-నిక్టే అలెజాండ్రా సొటోమయోర్(గుటెమల)పై విజయం సాధించి, రెండో రౌండ్‌లో అడుగుపెట్టింది. షిహో తనక-కొహరు యోనెమోటా (జపాన్) ద్వయంతో రెండో రౌండ్‌లో మేఘన-పూర్విషా జోడీ ఢీకొననుంది. తెలంగాణ షట్లర్ ఎన్. సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప జోడీ మహిళల డబుల్స్‌లో నేడు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. వీరితో పాటు పూజ దండు-సంజనా సంతోష్ ద్వయం కూడా మంగళవారం బరిలో దిగనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి జంట తొలిరౌండ్ ఆడనుండగా.. పురుషుల డబుల్స్‌లో మను అత్రి-సుమిత్ రెడ్డి, ఎమ్ఆర్ అర్జున్-శ్లోక్ రామచంద్రన్, అరుణ్-సన్యమ్ శుక్లా జోడీలు బరిలో దిగనున్నాయి.

పడిలేచిన శ్రీకాంత్..

మరో మ్యాచ్‌లో ఏడో సీడ్ కిడాంబి శ్రీకాంత్ 17-21, 21-16, 21-6 తేడాతో అన్‌సీడెడ్ నాట్ గుయెన్(ఐర్లాండ్)పై చెమటోడ్చి నెగ్గాడు. 66 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్ ప్రారంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన తెలుగు షట్లర్ మధ్యతో గతి తప్పాడు. ఓ దశలో 14-7తో ముందంజలో ఉన్నా.. పదేపదే తప్పిదాలు చేసి గేమ్‌ను 17-21తో కోల్పోయాడు. రెండో గేమ్ ప్రారంభంలోనూ 3-6తో వెనుకబడి ఆందోళన రేకెత్తించిన శ్రీకాంత్.. ఆ తర్వాతి నుంచి అదరగొట్టాడు. ప్రత్యర్థి ఆధిపత్యాన్ని క్రమంగా తగ్గించుకుంటూ పోతూ చివరికి 21-16తో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో విశ్వరూపం ప్రదర్శిస్తూ.. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఏకంగా 11వరుస పాయింట్లతో 21-6 తేడాతో కైవసం చేసుకొని రెండో రౌండ్‌లో ప్రవేశించాడు. రెండో రౌండ్‌లో మిషా జిల్‌బెర్మాన్ (ఇజ్రాయిల్)తో శ్రీకాంత్ తలపడనున్నాడు.

# బ్యాటింగ్ కోచ్ బరిలో లాల్‌చంద్ రాజ్‌పుత్



ముంబై: టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ పదవి ఆశించి భంగపడ్డ మాజీ ఆటగాడు లాల్‌చంద్ రాజ్‌పుత్ బ్యాటింగ్ కోచ్‌గానైనా ఎంపికవ్వాలని ప్రయత్నిస్తున్నాడు. జింబాబ్వే, ఆఫ్ఘనిస్థాన్ జాతీయ జట్లకు కోచ్‌గా పనిచేసిన రాజ్‌పుత్ సొంత జట్టు తరఫున ఏదో ఓ స్థాయిలో సేవలదించేందుకు సిద్ధమయ్యాడు. క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ ఇటీవల టీమ్‌ఇండియా ప్రధాన కోచ్‌గా రవిశాస్త్రినే కొనసాగించగా.. అతడి సహాయక సిబ్బంది నియామక ప్రక్రియను ఎమ్మెస్కే ప్రసాద్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల సెలక్షన్ కమిటీ ప్రారంభించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, జట్టు మేనేజర్ పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం నుంచి ఇంటర్వ్యూలు మొదలుపెట్టింది. దరఖాస్తు చేసుకున్న వారందరి ఇంటర్వ్యూలు గురువారంలోగా పూర్తికానుండగా, ఆ రోజే సహాయక సిబ్బంది పేర్లను ప్రకటించే అవకాశముంది. బ్యాటింగ్ కోచ్ రేసులో రాజ్‌పుత్, మాజీ ఓపెనర్ విక్రమ్ రాథోడ్ ముందున్నారు. వారితో పాటు ఈ స్థానానికి ప్రవీణ్ ఆమ్రే, ముంబై మాజీ స్టార్ అమోల్ మజుందార్, సితాన్షు కొటాక్, హృతికేశ్ కనిత్కర్, మిథున్ మన్‌హాస్ కూడా దరఖాస్తు చేసుకున్నారు. కాగా, బౌలింగ్ కోచ్ స్థానం కోసం దిగ్గజ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ దరఖాస్తు చేసుకోగా, పరాస్ మాంబ్రే, అమిత్ భండారీ కూడా పోటీలో ఉన్నారు. ఫీల్డింగ్ కోచ్ పదవికి దక్షిణాఫ్రికా ఆల్‌టైం బెస్ట్ ఫీల్డర్ జాంటీరోడ్స్ దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నాడు.

ప్రస్తుతం టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్‌గా సంజయ్ బంగర్, బౌలింగ్‌కు భరత్ అరుణ్, ఫీల్డింగ్‌కు ఆర్.శ్రీధర్ ఉన్నారు. ప్రపంచకప్‌తోనే వీరి పదవీ కాలం ముగిసినా వెస్టిండీస్ టూర్ కోసం బీసీసీఐ మరో 45 రోజుల గడువు పొడిగించింది. ప్రస్తుతం సహాయక సిబ్బంది నియామకం కోసం ఇంటర్వ్యూల ప్రక్రియ జరుగుతున్నా.. భరత్, శ్రీధర్ వారి స్థానాల్లోనే కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధాన కోచ్ రవిశాస్త్రి సైతం ఇప్పుడున్న వారినే కొనసాగించాలని చెప్పినట్టు సమాచారం. భరత్ అరుణ్ నేతృత్వంలో టీమ్‌ఇండియా బౌలింగ్ చాలా మెరుగైంది. ముఖ్యంగా పేస్ విభాగంలో బలోపేతమైంది. బుమ్రా సహా మిగిలిన బౌలర్లందరూ చక్కగా రాణిస్తున్నారు. దీంతో అతడి పదవి పదిలంగానే ఉంటుందనేది విశ్లేషకుల మాట. అలాగే భారత జట్టు ఫీల్డింగ్ కూడా గత కొంత కాలంగా ఉన్నత ప్రమాణాలతో ఉంది. ఆటగాళ్లు మెరుపు ఫీల్డింగ్‌తో మెప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాంటీ రోడ్స్ పోటీలో ఉన్నా.. ఎమ్మెస్కే కమిటీ ఆర్.శ్రీధర్ వైపే మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎటొచ్చి బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ స్థానమే ప్రమాదంలో పడింది. ప్రపంచకప్ సహా కొంతకాలంగా మిడిల్‌ఆర్డర్ వైఫల్యం అతడి పదవిపై ప్రభావాన్ని చూపనుండగా.. ఆ స్థానం కోసం పోటీదారులు సైతం బలంగా ఉన్నారు. ఏ స్థానానికి ఎవరు ఎంపికవుతారన్న అంశంపై గురువారం స్పష్టత రానుంది.

## ఇసో అల్బెన్ డబుల్ ధమాకా

న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు తమ అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేశారు. ఇసో అల్బెన్ డబుల్ ధమాకా కొట్టడంతో ఈ టోర్నీలో భారత్ మొత్తం మూడు పతకాలు ఖాతాలో వేసుకుంది. ఇసో అల్బెన్, రొనాల్డో సింగ్, రోజిత్ సింగ్‌తో కూడిన భారత బృందం పురుషుల టీమ్ స్ప్రింట్ ఈవెంట్‌లో ఇప్పటికే స్వర్ణం సాధించగా.. తాజాగా అల్బెన్ మరో రజతం, కాంస్యం చేజిక్కించుకున్నాడు. పోటీల చివరి రోజు సోమవారం వ్యక్తిగత స్ప్రింట్ ఈవెంట్‌లో రజతం నెగ్గిన 18 ఏండ్ల అల్బెన్.. వ్యక్తిగత కైరిన్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. మొత్తం మూడు మెడల్స్‌తో భారత్ పతకాల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. అంతర్జాతీయ సైక్లింగ్ పోటీల్లో భారత్‌కు ఇదే ఉత్తమం. జర్మనీ, న్యూజిలాండ్, గ్రీస్ వరుసగా తొలి మూడు స్థానాలు దక్కించుకున్నాయి.



5. హైదరాబాద్‌లో సోమాజీగూడ వద్ద రాజీవ్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన కాంగ్రెస్ నేతలు మల్లు భట్టి విక్రమార్క, మర్రి శశిధర్ రెడ్డి

## ఆరు రాష్ట్రాలకు భారీ వర్షాలు

### వాతావరణశాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): దేశంలోని ఆరు రాష్ట్రాల్లో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని కేంద్ర వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తరాఖండ్, యుపి, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, భీహార్, కేరళ రాష్ట్రాల్లో కుంభవృష్టి కురుస్తోందని హెచ్చరికలు జారీ చేసింది. ఆయా రాష్ట్రాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలిని సూచించింది. ఇటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే ఇప్పటికే పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే.

దేశ రాజధాని ఢిల్లీలోని యమునా నది ప్రమాదకర స్థాయిలోనే ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో యమునా నదితీరంలో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. యమునా నది డేంజర్ మార్క్ 205.33 మీటర్లు కాగా, ప్రస్తుతం 205.96 వద్ద వరద ప్రవహిస్తోంది. హర్యానాలోని హత్నికుండ్ బ్యారేజ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో యమునాకు వరద పోటెత్తింది. ఇవాళ ఉదయం 25,316 క్యూసెక్కుల నీటిని అధికంగా విడుదల చేశారు. వరద ప్రవాహం గంట గంటకు పెరుగుతుండడంతో ఓల్డ్ లోహ పుల్ రహదారిని మూసివేశారు. పాదాచారులను ఇక్కడికి రానివ్వడం లేదు. వాహనాలను దారి మళ్లించారు.

## తృటిలో తప్పించుకున్న ఇద్దరు జాలర్లు

భోపాల్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): భోపాల్‌లో ఇద్దరు మత్స్యకారులు తృటిలో ప్రాణపాయం నుంచి బయట పడ్డారు. వరదల్లో చిక్కుకున్న ఆ ఇద్దరిని భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్, అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. కెరవా డ్యామ్‌లో చాపలు పట్టేందుకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు ..డ్యామ్ గేట్లు తెరుచుకోండంతో.. ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగి అందులో చిక్కుకున్నారు. ప్రాణాల మీద ఆశలు పోగొట్టుకున్న సమయంలో అగ్నిమాపక సిబ్బంది అధికారులు సాహసోపేతంగా వారిద్దరినీ కాపాడారు. గత కొన్ని రోజులుగా మధ్యప్రదేశ్ లో కుండపోత వర్షాలకు డ్యాముల్లోకి వరద నీరు భారీగా చేరుకుంటోంది. నిల్వ సామర్థ్యానికి ఎక్కువ నీరు చేరడంతో అధికారలులు కార్వా డాం గేట్లు ఎత్తేశారు. దీంతో కింది ప్రాంతాలకు వరద ఉధృతి పెరిగింది.

## జీహెచ్‌ఎంసీ బాండ్ల ద్వారా నిధుల సమీకరణకు బిడ్డింగ్

హైదరాబాద్, ఆగష్టు 20: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ బాండ్ల ద్వారా నిధుల సమీకరణకు బిడ్డింగ్ నిర్వహించింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ద్వారా నిధులు సేకరణ జరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న బిడ్డింగ్‌ను గ్రేటర్ మున్సిపాలిటీ ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ దాన కిషోర్ పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ ఇప్పటి వరకు రెండు విడతల్లో బిడ్డింగ్‌కు వెళ్లింది. రెండు విడతల్లో రూ.395 కోట్లు సేకరించింది. ఇవాళ మూడో విడతలో రూ.100 కోట్లను సేకరించింది. కొద్ది రోజుల తరువాత నాలుగో విడత బిడ్డింగ్‌కు వెళ్లనుంది. బిడ్డింగ్ ద్వారా మొత్తం రూ.1000 కోట్లు సేకరించాడవే జీహెచ్‌ఎంసీ లక్ష్యం. ఈ నందర్భంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ మాట్లాడుతూ... బాండ్ల ద్వారా నిధులు సేకరిస్తున్నాం. రోడ్ల అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ మున్సిపాలిటీ బాండ్లకు వెళ్లలేదు. బల్దియా సహసం చేసి విజయం సాధించింది. అన్ని కార్పోరేషన్లకు జీహెచ్‌ఎంసీ మార్గదర్శిగా నిలిచింది. ప్రతి ఆరు నెలలకోసారి వడ్డీ చెల్లిస్తాం. అసలు చెల్లించడానికి పదేళ్ల సమయం ఉంటుందని తెలిపారు.

## భారీగా గుట్కా పట్టివేత

రంగారెడ్డి,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): రాజేంద్రనగర్ హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా నుంచి లారీలో హైదరాబాద్‌కు 50 లక్షల రూపాయల విలువ చేసే గుట్కాను తరలిస్తుండగా.. విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి.. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజిలెన్స్ అధికారులు.. రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 23నుంచి ప్రధాని విదేశీ పర్యటన

న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ పర్యటన చేయనున్నారు. యుఎఇ, ఫ్రాన్స్ బహ్రెయిన్ తదితర దేశాల్లో ఆయన మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. 23, 24 తేదీల్లో ఆయన యుఎఇలో పర్యటిస్తారు. అబుదాబి యువరాజుతో మోడీ భేటీ అవుతారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఆయన అబుదాబి యువరాజుతో చర్చిస్తారు. అనంతరం ఫ్రాన్స్ లో జరిగే జి-7 సదస్సులో మోడీ పాల్గొంటారు.

## అమీర్‌పేట టూ హైటెక్‌సిటీ.. ప్రతి 4 నిమిషాలకో రైలు..



హైదరాబాద్ , ఆగష్టు 20: హైటెక్ సిటీ నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు రివర్సల్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చింది. గతంలో జూబ్లీ చెక్‌పోస్టు నుంచి హైటెక్ సిటీ వరకు సింగిల్ లైన్ ద్వారా రైళ్లు నడిపింది మెట్రో. రివర్సల్ సిస్టమ్ అందుబాటులోకి రావడంతో ఇక నుంచి అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటీ వరకు ప్రతి 4 నిమిషాలకు ఒక మెట్రో రైలు నడవనుంది. ఎల్బీనగర్ నుంచి మియాపూర్ కారిడార్‌లో ప్రతి 5 నిమిషాలకు ఒక రైలు అందుబాటులోకి రానుంది. హైటెక్ సిటీ - అమీర్‌పేట కారిడార్‌లో 2, 3 వారాల పాటు ప్రతి 4 నిమిషాలకు ఒక రైలు నడవనుంది. ఆ తర్వాత పరిస్థితుల ఆధారంగా ప్రతి 3 నిమిషాలకు ఒక రైలు నడపనున్నారు. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని ఏసీ ఉష్ణోగ్రతను 23 డిగ్రీలకు తగ్గించారు.

సినిమా

# అ! సీక్వెల్ విజయ్ సేతుపతి, కాజల్ ?




యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ప్రయోగాత్మక చిత్రం అ! గత ఏడాది విడుదలై మంచి విజయం సాధించింది. ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే కాక బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు కూడా రాబట్టింది. నాని తొలిసారి నిర్మించిన ఈ చిత్రంలో నిత్యామీనన్, కాజల్ అగర్వాల్, శ్రీనివాస్ అవసరాల, రెజీనా, ప్రియదర్శి, ఈషా రెబ్బ, మురళీశర్మ, రోహిణి, దేవదర్శిని, సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలలో కనిపించి అలరించారు. ఈ చిత్రం ఇటీవల రెండు జాతీయ అవార్డులు కూడా గెలుచుకుంది. అయితే ప్రస్తుతం ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి సీక్వెల్ చేసే ఆలోచనలో ఉన్నాడట. తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి, అందాల భామ కాజల్ ప్రధాన పాత్రలలో సీక్వెల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. పలు కథలతో మొదటి పార్ట్ తెరకెక్కగా, రెండో పార్ట్ మొత్తం ఒక్కటే కథతో రూపొందనుందట. ఆ కథ ప్రేక్షకులకి మంచి ఎంటర్‌టైన్‌మెంట్ అందించేదిగా ఉంటుందని అంటున్నారు. సీక్వెల్ విషయం గురించి ప్రశాంత్ ఇటీవల ఓ ఇంగ్లీష్ పత్రికతో మాట్లాడారు. తప్పక అ! చిత్రానికి సీక్వెల్ ఉంటుందని స్పష్టం చేశారు. మరి ఇందులో విజయ్ సేతుపతి , కాజల్ నటిస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది.

# మలయాళ మూవీలో తమన్నా

తెలుగు, తమిళం, కన్నడం, హిందీ ఇండస్ట్రీల్లో సినిమాలు చేసి మంచి ఫాలోయింగ్ ఏర్పరచుకున్నారు తమన్నా. నార్త్ టు సౌత్ తమన్నా అందరికీ పరిచయం. కానీ ఇప్పుడు మలయాళ ఇండస్ట్రీకి తొలి పరిచయం కాబోతున్నారు. పద్నాలుగేళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్న తమన్నా తొలిసారి మలయాళంలో స్ట్రయిట్ మూవీ చేస్తున్నారు.

గతంలో డబ్బింగ్ సినిమాల ద్వారా మలయాళంలో కనిపించారామె. ఇప్పుడు తొలి స్ట్రయిట్ సినిమాతోనే ప్రేక్షకులను భయపెడతానంటున్నారు. 'సెంట్రల్ జైలిలే ప్రేతం' (సెంట్రల్ జైల్‌లో దెయ్యం అని తెలుగు అర్థం) అనే హారర్ సినిమాలో లీడ్ రోల్ చేస్తున్నారు తమన్నా. కథ మొత్తం ఓ సెంట్రల్ జైల్, అందులో ఉండే దెయ్యాల చుట్టూ తిరుగుతుందట. ఇందులో మలయాళ, తమిళ స్టార్స్ యాక్ట్ చేయనున్నారు. సంధ్యా మీనన్ దర్శకురాలు.

# అంధాధున్' రీమేక్‌లో నాని?




ఒక భాషలో విడుదలై ఘనవిజయంగా నిలిచిన సినిమాను ఇతర భాషల్లోకి రీమేక్ చేసే ట్రెండ్ ప్రస్తుతం బాగా నడుస్తోంది. ముఖ్యంగా దక్షిణాది సినిమాలు బాలీవుడ్‌లో ఎక్కువగా రీమేక్ అవుతున్నాయి. అయితే ఓ బాలీవుడ్ సినిమా కూడా దక్షిణాదిన చర్చనీయాంశంగా మారింది. బాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన 'అంధాధున్' సినిమాను దక్షిణాది భాషల్లోకి రీమేక్ చేసేందుకు ప్రయ్నతాలు జరుగుతున్నాయి. ఈ సినిమాలో హీరోగా నటించిన ఆయుష్మాన్ ఖురానాకు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు కూడా వచ్చింది.

తమిళంలో ప్రశాంత్ హీరోగా ఈ సినిమా రీమేక్ అవుతోంది. తెలుగులో కూడా ఈ సినిమా రీమేక్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. నేచురల్ స్టార్ నాని ఈ సినిమాపై ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. నాని ప్రస్తుతం 'గ్యాంగ్‌లీడర్' సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా తర్వాత ఇంద్రగంటి మోహన్‌కృష్ణ తెరకెక్కించనున్న 'వి' సినిమా చేయనున్నాడు. ఆ తర్వాత 'అంధాధున్' రీమేక్‌ను పట్టాలెక్కించే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# చెన్నై సముద్ర తీరంలో వింత అలలు

**- రాత్రివేళ నీలిరంగు కాంతులతో ఎగిసిపడుతున్న అలలు**

**- వింతను చూసేందుకు బారులు తీరిన నగర ప్రజలు**

**- ముప్పు వాటిల్లే ప్రమాదముందంటున్న శాస్త్రవేత్తలు**

చెన్నై, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : చెన్నై సముద్ర తీరంలో వింత చోటుచేసుకుంది. రాత్రివేళ సముద్ర అలలు నీలి రంగులో కాంతులు వెదజల్లడం చూసి ప్రజలు షాకయ్యారు. ఎలాంటి విద్యుత్తు దీపాలు లేకుండా సముద్రం నుంచి ఆ కాంతులు ఎలా వస్తున్నాయంటూ ఆశ్చర్యపోయారు. ఆ వింతను చూసేందుకు నగర ప్రజలంతా సముద్ర తీరాని భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలోనూ వైరల్‌గా చక్కర్లు కొడుతున్నాయి. ఈ వింత కాంతులు ప్రజలకు సరికొత్త అనుభూతినైతే పంచుతున్నాయి. కానీ, శాస్త్రవేత్తల్లో మాత్రం ఆందోళన రేకెత్తిస్తున్నాయి. కెరటాల తాకిడి వల్ల ఫైటోప్లాక్టన్‌లో ఉండే రసాయనిక శక్తి విద్యుత్ శక్తిగా మారి నీలం రంగులో మెరుస్తాయి. సముద్ర పర్యావరణ వ్యవస్థలో మార్పుల వల్లే బయోలుమినిసెన్స్ ఫైటోప్లాక్టన్ ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో తమిళనాడు సముద్ర తీరానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల వేడెక్కుతున్న సముద్ర మార్పులను ఇది సూచిస్తుందని తెలుపుతున్నారు. ఈ పరిస్థితిని 'నోక్టిలుకా ఆల్గే' అంటారని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇదిలాఉంటే 'నోక్టిలుకా ఆల్గే' వల్ల సముద్రంలో పాచి వంటి జీవులు వృద్ధి చెందుతాయి. అవే.. బయోలుమినిసెన్స్ ఫైటోఫ్లాక్టన్స్. చూసేందుకు నాచులా కనిపించినా.. ఇవి పూర్తిగా మాంసాహారులు. ఇవి సముద్రంలో ఉండే నక్షత్ర చేపలు, జెల్లీ ఫిష్, అంగ్లేర్ ఫిష్‌లను ఆహారంగా తీసుకుంటాయి. అలాగే మిణుగురు పురుగులను కూడా ఆకర్షించి తినేస్తాయి. కెరటాలు తాకినప్పుడు ఇవి ఆక్సిజన్‌ను గ్రహించడం ద్వారా రసాయనిక చర్యకు గురవ్వుతాయి. ఫలితంగా నీలం రంగులో మెరుస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**BEFORE THE HONBLE COMMISSIONER FOR WORKMENS COMPENSATION ASST. LABOUR COMMISSIONER IV HYDERABAD**
**E.C.NO.258 OF 2018**

Between:
**Mrs. Tara Khatoon**
...Petitioner
**And**
**Mr. Ateeq Ahmed and others**
..Respondents

To
**Mr. Ateeq Ahmed**
**S/o. Abdul Basheer**
**Age: 32 Years, Occ: Owner of Lorry No.HR 63A 1088**
**R/o. Ward No.15,**
**Dhaura Thanda Village**
**Bojipura Tq.**
**Bareilly Dist. Uttar Pradesh**
... Opp. Parties.1

Whereas the above named Petitioners filed compensation petition against you and The United India Insurance Company Ltd. for a sum of Rs. 10,00,000/- for the accident caused by your vehicle Lorry bearing No.HR 63A 1088 on 30-05-2017 at Ramannapet ps limits. The above case is posted on **22-08-2019.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 3.00 PM on the above said date before the Hon'ble court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE COURT)
**C. VENU GOPAL REDDY**
**S. VENLAT REDDY**
Advocates.
Off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad.
Cell: 9440431541

**IN THE COURT OF THE MACT-CUM-XXVII ADDL CHIEF JUDGE C.C.C. AT SECUNDERABAD**
**M.V.O.P. No :775 of 2018**

Between;
Smt. Velineni Madhavi
. ..Petitioner.
**AND**
Mr. Raja Kumar & Others
...Respondents.

To,
**Sri.Yampalla Bugga Ram Reddy**
**S/o. Y. Narsimha Reddy**
**Age: Major, Occ: Major**
**R/o.H.No. 4-43, Karnamguda Village, Pocharam, B.O. Ibrahimpatnam**
**R.R. Dist. T.S-501 506**
**Respondent No.2**

Whereas the above named petitioner filed compensation against you and Cholamandalam Ms General Insurance Co.Ltd and T.S.R.T.C for a sum of Rs.1,00,000/- for the accident caused by your vehicle bus bearing No. TS 08 UB 3579 at Punjagutta ps limits. The above case is posted to **30.08.2019** you are hereby summon to appear either in person or through pleader with your defense in any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the op will be heard and determined exparte.

(BY ORDER OF THE HON'BLE COURT )
Mr. A. Poorna Chandra Rao
Advocate,
# Vijayapuri Colony,
Uppal, Hyderabad-39.
Cell: 9490988649

# దిగొచ్చిన పసిడి!

**- ఏకంగా రూ.230 తగ్గుదల**

హైదరాబాద్, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన పసిడి ధర.. ఒక్కసారిగా పడిపోయింది. హైదరాబాద్ మార్కెట్‌లో మంగళవారం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ.230 తగ్గుదలతో రూ.39,130కు దిగొచ్చింది. అంతర్జాతీయంగా బలహీనమైన ట్రెండ్ సహా జువెలర్ల్స, రిటైలర్ల నుంచి డిమాండ్ మందగించడంతో పసిడి ధరపై ప్రతికూల ప్రభావం పడిందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇదేసమయంలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.200 తగ్గుదలతో రూ.35,870కు దిగొచ్చింది. బంగారం ధర పడిపోతే.. వెండి ధర మాత్రం స్థిరంగా ఉంది. కేజీ వెండి ధర నిలకడగా రూ.47,850 వద్ద కొనసాగుతోంది. పరిశ్రమ యూనిట్లు, నాణెళిపు తయారీదారుల నుంచి డిమాండ్‌లో పురోగతి లేకపోవడం ఇందుకు కారణం. విజయవాడ, విశాఖపట్నంలో కూడా ధరలు ఇలానే ఉన్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో బంగారం ధర దిగొచ్చింది. పసిడి ధర ఔన్స్‌కు 0.31 శాతం తగ్గుదలతో 1,506.95 డాలర్లకు క్షీణించింది. అదేసమయంలో వెండి ధర ధర ఔన్స్‌కు 0.31 శాతం క్షీణతతో 16.88 డాలర్లకు తగ్గింది. ఢిల్లీ మార్కెట్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.100 తగ్గుదలతో రూ.38,300కు దిగొచ్చింది. ఇక 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.100 తగ్గుదలతో రూ.37,100కు క్షీణించింది. ఇక కేజీ వెండి స్థిరంగా రూ.47,850 వద్ద కొనసాగుతోంది. బంగారం ధరలపై ప్రభావం చూపే అంశాలు చాలానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం, గ్లోబల్ మార్కెట్ పసిడి ధరల్లో మార్పు, కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారం నిల్వలు, వడ్డీ రేట్లు, జువెలరీ మార్కెట్, భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు వంటి పలు అంశాలు పసిడి ధరపై ప్రభావం చూపుతాయి.

### ఆల్కాపుర ఔటర్ రింగ్‌రోడ్డుపై

# కారు ప్రమాదం

**- అదుపు తప్పి గార్డెన్ ఫెన్సింగ్‌ను ఢీకొన్న కారు**

**- కారులో సినీ హీరో రాజ్‌తరుణ్**

**- ప్రమాదం జరిగిన వెంటనే కారువదిలి వెళ్లిపోయిన తరుణ్**

**- సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు**

హైదరాబాద్, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లా అల్కాపురి టౌన్‌షిప్ వద్ద మంగళవారం తెల్లవారుజామున టీఎస్ 09 ఈఎక్స్ 1100 నంబరుతో ఉన్న వోల్వో ఎస్90 లగ్జరీ కారు ప్రమాదానికి గురైంది. ఈ కారు హీరో తరుణ్‌ది అని, ప్రమాదం జరిగిన వెంటనే ఆయన అక్కడి నుంచి పారిపోయారని ప్రచారం జరిగింది. పలు టీవీ ఛానెళ్లలో ఈ వార్తను మంగళవారం ఉదయం ప్రసారం చేశారు.

అయితే, తాను ఎలాంటి కారు ప్రమాదానికి గురికాలేదని, అసలు ప్రమాదానికి గురైన కారు తనది కాదంటూ క్లారిటీ ఇచ్చారు తరుణ్. పోలీసులు కూడా ఇదే విషయం స్పష్టం చేశారు. ఈ కారు ప్రమాదంపై విచారణ చేపట్టిన పోలీసులు అల్కాపురి టౌన్‌షిప్ సర్కిల్ వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు.

తెల్లవారుజామున చీకట్లో కారులో నుంచి దిగి పారిపోయింది హీరో రాజ్ తరుణ్ అని స్థానికులు పోలీసులకు వెల్లడించారు. ఇదే విషయం సీసీటీవీ ఫుటేజ్‌లో స్పష్టమైంది. జంక్షన్‌ను దాటుకొని వోల్వో కారు వెళ్లినట్టు సీసీటీవీలో రికార్డయింది. ఆ తరవాత కొంత సేపటికి రాజ్ తరుణ్ వెనక్కి పరిగెత్తుకుంటూ వచ్చారు. ఈ విజువల్స్ సీసీటీవీలో స్పష్టంగా రికార్డయ్యాయి. అది చాలా చిన్న సర్కిల్ అని తరుచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాజ్ తరుణ్ కారుసైతం వేగంగా డివైడర్‌ను ఢీకొట్టి మూడు పల్టీలు కొట్టి ఆ తరవాత రోడ్డు పక్కన గోడను ఢీకొట్టుకుంటూ ఖాళీ స్థలంలో పడిందని వెల్లడించారు. ఇది లగ్జరీ కారు కావడంతో రాజ్ తరుణ్‌కు ఎలాంటి ప్రమాదం కాలేదు. కారు పాక్షికంగా ధ్వంసమైంది. కేసును విచారిస్తోన్న నార్సింగి పోలీసులు రాజ్ తరుణ్‌ను సంప్రదించడం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ కారు హీరో తరుణ్ ది అని వార్తలు వచ్చాయి. రోడ్డు ప్రమాదం నుంచి తరుణ్ ప్రాణాలతో బయటపడ్డాడని మీడియాలో న్యూస్ వచ్చింది. ఆ కారు తరుణ్ ది అని అనుకున్నారు. దీనిపై స్వయంగా తరుణ్ స్పందించాడు. యాక్సిడెంట్ వార్తలను ఖండించాడు. ఆ న్యూస్ ఫేక్ అని చెప్పాడు. తనకు ఎలాంటి ప్రమాదం జరగలేదన్నాడు. నేను ఇంట్లోనే ఉన్నాను, ఆ కారు నాది కాదు అని తరుణ్ క్లారిటీ ఇచ్చారు.

ఈ విషయంపై పలు ఛానల్స్‌లో తరుణ్ తో ఫోన్ లో మాట్లాడారు. యాక్సిడెంట్ న్యూస్ ఫేక్ అని తరుణ్ వివరణ ఇచ్చాడు. అది ఫేక్ న్యూస్ అని, యాక్సిడెంట్ వార్తలు చూసి షాక్ అయ్యానని, నేను చాలా హెల్తీగా ఉన్నానని, ఇంట్లోనే ఉన్నా అని, ఆ కారు నాదికాదు.. నా కారు జాగ్వార్ అని వివరణ ఇచ్చారు. అది ఇంట్లోనే ఉందని, అసలు నాకు సంబంధమే లేదని అన్నారు. ఈ న్యూస్ ఎందుకు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని, ఏదన్నా న్యూస్ వేసే ముందు ఒక్కసారి నిజానిజాలు కనుక్కుని ప్రసారం చేస్తే బాగుంటుందని మీడియాకు రాజ్‌తరుణ్ సూచించారు. పొద్దున నుంచి నాకు ఫోన్లు వస్తున్నాయని, నా బంధువులు, స్నేహితులు, అభిమానులు ఫోన్లు చేస్తున్నారని, అది ఫేక్ న్యూస్ అని అందరికి చెప్పానని తరుణ్ స్పష్టం చేశాడు.

### ఆ ఫర్నీచర్..

# నా ఆఫీస్‌లోనే వినియోగించాం

**- తీసుకెళ్లమని గతంలో అసెంబ్లీ అధికారులకు లేఖలురాశా**

**- ఇప్పుడైనా తీసుకెళ్లొచ్చు.. నగదురూపంలోనైనా చెల్లిస్తా**

**- ఫర్నీచర్ మాయంపై మాజీ స్పీకర్ కోడెల**

అమరావతి, ఆగస్టు20(ఆర్ఎన్ఎ) : ఏపీలో ప్రభుత్వానికి సంబంధించిన ఫర్నీచర్ మాయమైపోవడం సంగతి తెలిసిందే.. హైదరాబాద్ నుంచి రాజధాని ప్రాంతంలోకి వెలగపూడికి ఫర్నీచర్‌ను తరలించిన సమయంలో ఓ లారీలో తరలించిన సామాను కనిపించకుండా పోయిందట. 2017లోనే ఈ వ్యవహారం జరిగితే.. తాజాగా అధికారులు గుర్తించారు. ఫర్నీచర్ మాయం కావడంపై తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాయమైన ఫర్నీచర్ ఏపీ అసెంబ్లీతో పాటూ సచివాలయానికి సంబంధించిందిగా చెబుతున్నారు అధికారులు. ఈ వ్యవహారంలో మాజీ స్పీకర్ కోడెలపై విమర్శలొచ్చాయి. ఈ ఆరోపణలపై కోడెల స్పందించారు. ఫర్నీచర్ విషయంలో మీడియాలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. హైదరాబాద్ నుంచి అసెంబ్లీ ఫర్నిచర్ తరలించారని.. అందులో కొంత ఫర్నీచర్‌ను తన కార్యాలయంలో వినియోగించుకున్నానన్నారు. ఈ ఫర్నీచర్ తిరిగి తీసుకెళ్లమని గతంలోనే అసెంబ్లీ అధికారులకు లేఖలు రాసినట్లు చెప్పుకొచ్చారు. తన లేఖలపై ఎవరూ స్పందించ లేదని కోడెల తెలిపారు. అధికారులు ఇప్పటికైనా వస్తే ఫర్నీచర్‌ను అప్పగిస్తానన్నారు కోడెల తెలిపారు.

**IN THE COURT OF THE HON'BLE I ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT: SECONDRABAD.**
**O.P.NO 317 of 2017**

Between;
B.Agamma & others
. ..Petitioners.
**AND**
Saibaba & others .
...Respondents.

To,
**R-1 Sai Baba,**
**S/o Bala Krishna,**
**Aged: Major, Occ: Driver,**
**R/o Achampet,**
**Mahabub Nagar Dt.**

NOTICE.

Please take notice that the above petitioners have filed the above O.P for compensation against you and Respondent No-3. Several times notices were issued to you through court and R.P but you have failed to receive the same. The case is posted On the day of **12-09-2019** for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE COURT )
L.R.Prakash
Advocate,
H. No 10-308/A/1, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad.
Cell No. 9866611022

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.